Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 21.11.2014, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 25
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## బలహీన



### తల తోక లేకుండా పోతున్న అధికారపక్షం

# ప్రభుత్వం

**రాష్ట్రంలో ప్రధానంగా నెలకొన్న సమస్యలను తొలగించే దిశగా చంద్రబాబు ప్రభుత్వం ఒక్క ప్రయత్నం కూడా చేయడం లేదు. రాష్ట్రంలో సమస్యలకంటే రాష్ట్రానికి అర్జెంట్‌గా సింగపూర్ లాంటి రాజధాని అవసరం అనే మైకంలో చంద్రబాబు ఉన్నాడు. నిద్రలేస్తే రాజధాని గురించి తప్పితే రెండో మాట లేదు ఆయన నోటి నుండి. సింగపూర్ లాంటి రాజధాని ఇప్పుడు మనకు అవసరమా అనేది ఆలోచన చేయడం లేదు.**

సింగపూర్ రాజధాని నగరం కాదు. అది ఒక దేశం. అదో చిన్న ద్వీపం. దాని పరిధి ఎటుచూసినా 30కిలోమీటర్లే. ఎత్తైన భవంతి ఎక్కిచూస్తే మొత్తం దేశం కనిపిస్తుంది. ఎకరా వ్యవసాయం కూడా లేదు. భూమి లేదు కాబట్టి వాళ్ల ఆకాశహార్మ్యాలు నిర్మించుకోవాల్సిందే! అక్కడ పంటలు పండవు. టూరిజం, ట్రేడింగ్ మీదే ఆ దేశం మనుగడ సాగిస్తుంది. సెంటు వ్యవసాయం లేని సింగపూర్‌కు వ్యవసాయమే ప్రధానంగా జీవిస్తున్న మనకు ఆ దేశాన్ని ఏ విధంగా స్ఫూర్తిగా తీసుకోవాలో బోధపడదు. చంద్రబాబు కాన్సెప్ట్ కృష్ణా-గుంటూరు జిల్లాలలో పచ్చటి పొలాలను పాడుచేసి సింగపూర్‌లో లాంటి బిల్డింగ్‌లను కట్టడంలాగే వుంది. రాజధానికి మా భూమిలిచ్చేది లేదని రైతులు నెత్తి నోరు బాదుకుంటున్నా, వారి నుండి బలవంతంగానైనా భూములు లాక్కోవడానికి సిద్ధపడ్డ ప్రభుత్వం అందుకు కొత్త చట్టాన్ని కూడా తెచ్చింది. అసలే అప్పులు అవస్థలతో సతమతమవుతున్న మనకు అద్భుతమైన రాజధాని అంత అర్జంటేమీ కాదు. అదీగాక రైతుల కడుపు మండించి వారి భూములు లాగేసుకుని వారి ఉసురు పోసుకోవాల్సిన పనిలేదు. హైదరాబాద్ పదేళ్లదాకా ఉమ్మడి రాజధానిగానే ఉంటుంది. ఈలోపు విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో తాత్కాలిక రాజధానిని సాదాసీదాగా ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రంలో రాజధాని కంటే ముందు చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలి. రాష్ట్రంలో నూతన పారిశ్రామికాభివృద్ధికి శ్రీకారం చుట్టాలి. (మిగతా 10వ పేజీలో)

### సమర్థవంతంగా దాడికి దిగలేకపోతున్న వైరిపక్షం

# ప్రతిపక్షం

రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వముంది. పటిష్టమైన ప్రతిపక్షమూ వుంది. ఈ రెండు పక్షాలు కూడా సమర్థవంతంగా పనిచేస్తుంటే రాష్ట్రంలో పరిపాలన సవ్యంగా ఉంటుంది. ఈ రెండు కూడా అసమర్థంగా వ్యవహరిస్తే ఆ రాష్ట్ర పురోగతి ఏడుస్తున్నట్లే ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్ర విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెట్టడమే ప్రభుత్వ ధ్యేయమై ఉండాలి. ఈ మార్గం నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు కనిపిస్తే ప్రతిపక్షం కన్నెర్రజేసి ప్రభుత్వాన్ని దారికి తేవాలి. దురదృష్టమేమిటంటే ఆ రెండు ప్రయత్నాలు కనిపించక పోవడం.



### నెల్లూరులో...

## రోడ్డు విస్త'రణం'

(వివరాలు 3వ పేజీలో)

- ట్రంకురోడ్డు విస్తరణకు వెంకయ్య, నారాయణల పచ్చజెండా
- న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న వ్యాపారులు

### జిల్లాకు...

# పండుగొచ్చింది

క్రికెట్‌లో ప్రపంచస్థాయిలో కనీవినీ ఎరుగని విధంగా, అత్యద్భుతమైన రీతిలో పరుగుల వరద పారించి, భారత జాతి ఖ్యాతిని దశదిశలా మార్మోగించిన క్రికెట్ వీరుడు 'భారతరత్న' మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నెల్లూరుజిల్లాకు రావడమే ఒక అద్భుతం.. అది మనందరి అదృష్టం కూడా. క్రికెట్‌లో తన అమోఘమైన ఆటతీరును కనుపరచి ప్రపంచ ప్రజల కరతాళ ధ్వనులందుకున్న సచిన్, ఇప్పుడు ఒక ప్రజాప్రతినిధిగా కూడా తనదంటూ విశిష్టమైన.. విలక్షణమైన శైలిలో రాణిస్తూ తన ప్రత్యేకత చాటుకుంటున్నారు. క్రికెట్ మైదానంలో పరుగుల వరదను పారించినట్లే, ఇప్పుడు ఎంపీగా ప్రజలకు సేవలందిస్తూ, ప్రగతి పరుగుల్లోనూ అగ్రగామిగా నిలుస్తూ ప్రజలందరి మన్ననలు అందుకుంటున్నాడు.

(మిగతా 10వ పేజీలో)





# ఆరోగ్యశ్రీ అద్భుత పథకం



రోగులను పరామర్శిస్తున్న ఆత్మకూర ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ అద్భుత పథకమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరుజిల్లా ఆత్మకూరు పట్టణంలోని అభిరామ్ హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. ఈ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ వర్తింపజేయడంతో గౌతంరెడ్డి పరిశీలించారు. ఈ పథకం ద్వారా నిరుపేదలందరికి ఉత్తమసేవలు అందించాలని అభిరామ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ మేకపాటి దీప్తిని గౌతంరెడ్డి కోరారు.

# అన్ని రుణాలు మాఫీ చేయండి... మహాప్రభో...!

నెల్లూరుజిల్లా తడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో మహిళలు బైఠాయించి వెంటనే డ్వాక్రా రుణాలన్నింటిని మాఫీ చేయాలని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రుణాలన్నింటిని మాఫీ చేయాల్సిందేనని మహిళలు పట్టుబట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందువరకు మహిళలు బ్యాంకు రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తూ వచ్చారని, చంద్రబాబు ఎవరినీ కట్టవద్దని, అధికారంలోకి వస్తే అన్నీ మాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో అప్పులు కట్టడం మానేశారన్నారు. రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో గ్రూప్‌కు రూ.లక్ష మాత్రమే మాఫీ చేస్తానని చంద్రబాబు ఇప్పుడు చెబుతున్నారని, ముఖ్యమంత్రి నిర్వాకంతో ఆ డబ్బు వడ్డీకి కూడా సరిపోదన్నారు. బాబు అబద్ధాలు విని మహిళలు మోసపోయారన్నారు. ఆరు నెలలుగా రుణాలు చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగి అదనపు భారంగా మారాయన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట నెరవేర్చకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఏడుకొండలుకు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్‌రెడ్డి, మోదుగుల పార్థసారధి, మోదుగుల రమణయ్య, శ్రీనివాసులు, కృష్ణ, ఇలపా నాగేంద్ర, ఏళ్లూమలై, కుమార్ ఆనంద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# మైనింగ్ లీజులకు మూడింది

నెల్లూరుజిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆరు మైనింగ్ లీజులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి – నెలబల్లి ప్రాంతానికి చెందిన కె.రాజమోహన్‌రెడ్డికి సంబంధించి 66ఎకరాల్లో క్వార్ట్జ్ లీజు రద్దయింది. ఈ యాజమాన్యం వారు ప్రభుత్వానికి రూ.62వేల రెవెన్యూ చెల్లించాల్సివుంది. సరిహద్దులు సైతం సరిగా నిర్ణయించలేదని పేర్కొంది. దగదర్తి మండలంలోని కేకే గుంట ప్రాంతంలో శివ మైన్స్, మినరల్స్‌కు చెందిన 8.25ఎకరాల్లోని లెటరైట్ లీజును రద్దు చేసింది. విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన శ్రీధర్‌కు సంబంధించిన లైన్‌షెల్(సున్నపుగుళికలు) 20 ఎకరాల లీజును రద్దు చేసింది. పొదలకూరు మండలం దేగపూడి ప్రాంతానికి చెందిన రవి మైనింగ్ కంపెనీకి సంబంధించిన 40ఎకరాల్లో మైకా క్వార్ట్జ్‌ను రద్దు చేసింది. సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన రాధా మైనింగ్ కంపెనీకి చెందిన మైకా క్వార్ట్జ్ 11.64ఎకరాల లీజును రద్దు చేసింది. తలుపూరు ప్రాంతానికి చెందిన పి.ఇందిరకు చెందిన 7ఎకరాల మైనింగ్ లీజును రద్దు చేసింది. ఈ కంపెనీలన్నీ ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంతో రద్దు చేసింది.


## చేతివృత్తుల శిక్షణా కేంద్రానికి రూ.50వేలు వితరణ

నెల్లూరు పడారుపల్లి వికలాంగుల కాలనీ ఆచర్య పిసిరెడ్డి సమాజ మందిరంలో నిర్వహిస్తున్న వికలాంగుల చేతివృత్తుల శిక్షణా కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి సతీమణి గిరిజకుమారి రూ.50వేలను వేదాయపాలెంలోని శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు జి.వెంకటలక్ష్మికి చెందిన పవిత్ర నిలయంలో సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో తిక్కవరపు వెంకటశేషమ్మ, సుకుమార్‌రెడ్డి, జి.రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కోసం కదం తొక్కారు

### 50ఎడ్లబండ్లతో ర్యాలీ

ఇసుక తోలుకునేందుకు అనుమతి నివ్వాలంటూ ఎడ్లబండ్ల యజమానులు నెల్లూరుజిల్లా నాయుడుపేట పట్టణంలో కదంతొక్కారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని గాంధీ మందిరం నుండి సుమారు 50ఎడ్ల బండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్ల యజమానులు మాట్లాడుతూ నివాసగృహాలకు ఇసుక తోలుకునేందుకు అనుమతులిస్తే జీవనం సాగిస్తామన్నారు. గత 15రోజులుగా ఇసుకను తరలించకుండా నిలిపివేయడంతో తమ కుటుంబాలు జీవనం సాగించడం కష్టంగా ఉందన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు.

# నెల్లూరులో రోడ్డు విస్త'రణం'

**నెల్లూరు నగరంలో అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ వరకు దాదాపు 8కిలోమీటర్ల ట్రంకురోడ్డు విస్తరణ ఇప్పుడు పెద్ద పజిల్‌గా మారింది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయా? లేక ఆగిపోతాయా అన్న ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి.**

నెల్లూరు నగర అభివృద్ధిపై దృష్టిపెట్టిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ముందుగా నగర ప్రధాన రహదారి అయిన జివిఎన్‌టి రోడ్డును విస్తరించాలని జిల్లా అధికారులను ఆదేశించడం జరిగింది. దీని ప్రకారం నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం రంగంలోకి దిగి సవరించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం ట్రంకురోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు బస్టాండు నుండి శబరిక్షేత్రం వరకు వందఅడుగులు, అక్కడ నుండి అయ్యప్పగుడి వరకు 150అడుగులు, అక్కడ నుండి జాతీయ రహదారి వరకు 200అడుగులు మేర ట్రంకురోడ్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు కొన్ని చోట్ల మార్కింగ్ కూడా ఇచ్చారు. అయితే కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా మార్కింగ్ ఇవ్వడంపై దాదాపు 50మందికి పైగా వ్యాపారులు హైకోర్టులో పిటిషన్‌లు వేసి స్టే తెచ్చుకున్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ చేపడితే చాలా దుకాణాలు లేచిపోతాయి. ముఖ్యంగా కనకమహల్ నుండి మద్రాసు బస్టాండ్ వరకు, ఫతేఖాన్‌పేట ప్రాంతంలో కొంతవరకు, కెవిఆర్ పెట్రోల్ బంకు నుండి శబరిక్షేత్రం వరకు చాలా మంది వ్యాపారులు నష్టపోయే అవకాశాలున్నాయి. వ్యాపారులను రోడ్డున పడేస్తున్నారంటూ మాజీఎమ్మెల్యే వివేకా బహిరంగ విమర్శలకు దిగగా, తెలుగుదేశం, వైకాపా నాయకులలోనూ అదే భావన వుంది. కాకపోతే ట్రంకురోడ్డు విస్తరణ చేపట్టలేకపోతే ఇక నెల్లూరు అభివృద్ధికి నిధులంటూ తన వద్దకు రావద్దని వెంకయ్యనాయుడు తెగేసి చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో అధికార పార్టీ నాయకులు విస్తరణను ఆపే పరిస్థితి లేకుండాపోయింది.

ఎటువంటి పరిస్థితుల్లోనూ ట్రంకు రోడ్డు విస్తరణ జరిగితీరాల్సిందేనని కేంద్ర మంత్రి వెంకయ్యతో పాటు రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ కూడా ఆదేశించడంతో నెల్లూరు నగరంలో ఆగమేఘాల మీద మార్కింగ్ జరుగుతుంది. మున్సిపల్ అధికారుల మార్కింగ్‌తో చాలాచోట్ల వ్యాపారుల్లో ఆందోళన నెలకొంటుంది. కొన్నిచోట్ల పూర్తిగా దుకాణాలు పోతున్నాయి. ఇలాంటి వారిని నొప్పించకుండా ఒప్పించి, వారి బ్రతుకుదెరువుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి జివిఎన్‌టి రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని శాంతంగా, ప్రశాంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపైనే వుంది.



ఈ నెల 16వ తేదీన నెల్లూరు ఇందిరాభవన్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి

## వికలాంగులకు వెన్నెముకగా..

# లయన్స్ విశిష్ట సేవాశిబిరం





లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు వారు ఈ నెల 20వ తేదీ గురువారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచే ఓ మంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి వక్రీకరించి పుట్టుకతోనే అన్నికాలాలుగా వైకల్యంతో బాధపడుతున్న వారికి మీకు అండగా మేముంటామంటూ వారి దైనందిన జీవితాన్ని కొంతవరకు సంతోష మయం చేయడానికి వారికి అవసరమైన ఉపకరణాలను అందజేశారు. కేంద్ర కృత్రిమ అవయవాల సంస్థ(అలింకో) సహకారంతో గత నెల 17వ తేదీన లయన్స్‌క్లబ్ వారు నెల్లూరు టౌన్‌హాల్‌లో భారీ ఎత్తున వికలాంగుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్దఎత్తున తరలివచ్చిన వికలాంగులలో అవయవాల పంపిణీ కోసం 840మందిని ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 20వ తేదీన కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈ కృత్రిమ ఉపకరణాలను అందజేశారు. 240మందికి ట్రైసైకిల్స్, 80మందికి వీల్‌ఛైర్స్, 675మందికి వినికిడి యంత్రాలు, 16మందికి మెంటల్లీ ఛాలెంజిడ్ కిట్స్, 63మందికి కృత్రిమ అవయవాలు, 12మందికి బ్రెయిలీ కెయిన్ట్స్, 60 మందికి క్రచ్‌లు అందజేశారు. దాదాపు 65లక్షల విలువచేసే ఉపకరణాలను కేంద్ర కృత్రిమ అవయవాల సంస్థ సహకారంతో అందజేశారు. ఈ శిబిరానికి పెద్దఎత్తున వికలాంగులు వారి కుటుంబ సభ్యుల ఆసరాతో తరలివచ్చి ఆనందంగా తమకిచ్చిన ఉపకరణాలను స్వీకరించారు.

లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ శంకర్, కౌన్సిల్ ఛైర్మెన్ కోటేశ్వరరావు, ఎలంగోవన్, డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీమతి వై.అమృతవల్లి, వైస్‌డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు బాలస్వామి, చిన్నపరెడ్డి, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు యడ్లపల్లి సురేష్, ఎన్.వి.రమణయ్య, అలింకో ప్రతినిధి సమాల్, సింహపురి హాస్పిటల్ అధినేత రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కృష్ణమోహన్, కార్యదర్శి యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, కోశాధికారి సహజానందరెడ్డిలు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు.

# రేబాల ఆసుపత్రిలో ఎమ్మెల్యే



ఈ నెల 19వ తేదీన నెల్లూరు రేబాలవీధిలోని చిన్నపిల్లల ఆసుపత్రిని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులు, సిబ్బందిని సౌకర్యాల గురించి ఆరాతీసారు. గత 5నెలలుగా జీతాలు రావడం లేదని సిబ్బంది చెప్పడంతో అధికారులతో మాట్లాడి జీతాలు వచ్చేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఆసుపత్రిని పెద్దాసుపత్రికి మారుస్తారని డాక్టర్లు చెప్పారని, ఈ ప్రాంత ప్రజలకు ఎంతో అనువుగా వున్న ఈ ఆసుపత్రిని మార్చకుండా ఆరోగ్యశాఖమంత్రితో మాట్లాడతానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో 'హోప్ సత్సంఘ్ వేదిక' నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఊటుకూరు మాధవయ్య, దేవరకొండ అశోక్, వైకాపా నాయకులు కె.శ్రీనివాసులు, వండవాసి రంగ, వెంకటేశ్వర్లు, సోమ్‌నాథ్, నాగరాజు, హోప్ సత్సంఘ్ వేదిక సభ్యులు రవీంద్రబాబు, డి.వెంకటేశ్వర్లు, కె.బాలకృష్ణ, డి.వెంకయ్య, సి.పూర్ణచంద్రరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏషియన్ యోగా పోటీలలో

# గోల్ట్‌మెడల్ సాధించిన జోష్నవి

ఈ నెల 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో జరిగిన ఏషియన్ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలలో నెల్లూరు బాలిక రెండు పతకాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేసింది. నెల్లూరు నారాయణ టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఏకాంబరం జోష్నవి యోగా పోటీల్లో అద్భుత ప్రదర్శన చేసి వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని, గ్రూప్ విభాగంలో వెండిపతకాన్ని సొంతం చేసుకుంది. ఈ పోటీలలో ఛాంపియన్‌షిప్‌ను సైతం భారత్ కైవసం చేసుకోవడం విశేషం. జోష్నవి చిన్నవయస్సు నుండే యోగాలో ఆరితేరింది. జిల్లా స్థాయి పోటీల నుంచి జాతీయస్థాయి పోటీల వరకు ఎన్నో పోటీలలో పాల్గొని తన సత్తా చాటింది. 2013 అక్టోబర్‌లో పారిస్‌లో జరిగిన 25వ ప్రపంచ యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభాపాటవాలతో జోష్నవి 4కాంస్యపతకాలు సాధించింది. ఆ తర్వాత కూడా ఎన్నో పోటీల్లో పతకాలు సాధించిన జోష్నవి తాజాగా దక్షిణకొరియాలోనూ సత్తాచాటింది. డిసెంబర్ 3 నుండి అర్జెంటీనాలో జరగబోయే ప్రపంచ యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో కూడా జోష్నవి పాల్గొనబోతుంది.





## 'ప్రభా'తం

# మాటే మంత్రం



ప్రధాని నరేంద్రమోడీ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో చేసిన ప్రసంగం అక్కడి ప్రజలను ఉర్రూతలూగించింది. ఆయన మాట్లాడిన ప్రతిమాటా ప్రజల కరతాళధ్వనులందుకుంది. అచంచలమైన.. పరిపూర్ణమైన దేశభక్తితో, భారత దేశప్రజలకు సేవ చేయాలనే ప్రగాఢమైన ఆకాంక్షతో ఆయన చెప్పిన ప్రతిమాటా జయ జయధ్వానాలందుకుంది. ఆయన మాట మంత్రమై మార్మోగింది.

ఆయన మాట మంత్రమైపోయింది. ఆయన మాటంటే అందరికీ వేదమైపోయింది..ఆయన నిర్ణయాలు ఆచరణయోగ్యాలవుతున్నాయి. భారత దేశానికే కాదు, ప్రపంచానికే అవి మార్గదర్శకమవుతున్నాయి. మనదేశానికీ పలు ఇతరదేశాలకూ మధ్య ఇన్నాళ్ళూ వున్న దూరం తరిగిపోయి, స్నేహం వెల్లివిరుస్తోంది. ఆయా దేశాలతో వాణిజ్యానికి దారులు కుదురుతున్నాయి. అభివృద్ధికి బాటలు పడుతున్నాయి...వీటన్నిటికీ కేంద్రబిందువైన ఒకే ఒక్క వ్యక్తి..మహాశక్తి..మహోన్నత నేత.. భారత ప్రధాని నరేంద్రమోడీ. అమోఘము..అద్భుతమూ అయిన వాక్పటిమతో, అనర్ఘళంగా.. నిరాఘాటంగా ఎక్కడా అక్షరం కూడా తొట్రుపాటు లేకుండా..అత్యంత స్పష్టంగా..స్వచ్ఛంగా ఆయన మాట్లాడే తీరు ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రజల విశేష ప్రశంసలను అందుకుంటోంది. ఆయన మాటలు వినాలని, తద్వారా స్ఫూర్తిపొందాలని ప్రపంచవ్యాప్తంగా యువత ఉవ్విళ్ళూరుతోంది. దేశదేశాల ప్రముఖులంతా మోడీని కళ్ళారా చూడాలని, ఆయన ప్రసంగాలు వినాలని తహతహలాడుతున్నారంటే అతిశయోక్తి కాదు. అది అమెరికా అయినా, ఆస్ట్రేలియా అయినా..దేశమేదైనా..ఖండమేదైనా మోడీకి అఖండ స్వాగతమే లభిస్తోంది. మోడీ పర్యటనలతో దేశ విదేశాల్లోనూ, ఖండ ఖండాంతరాల్లోనూ భారతజాతి ఖ్యాతి రెపరెపలాడుతోంది. ఎక్కడ చూసినా.. ఎవరి నోట విన్నా.. మోడీ!.. మోడీ అనే నామజపమే వినిపిస్తోంది..అదీ ప్రధాని మోడీ ప్రత్యేకత. అందుకు తాజా ఉదాహరణ ఆయన ఆస్ట్రేలియా పర్యటన.

ఇటీవల భారత ప్రధాని మోడీ ఆస్ట్రేలియా పర్యటనతో ఆ దేశం పులకించి పోయింది. సిడ్నీలోని ఒలింపిక్ పార్కులో వున్న ఆల్‌ఫోన్స్‌ఎరీనాలో వేలాదిమంది ప్రవాసభారతీయులు మోడీని చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు పెద్దపెట్టున తరలిరావడంతో, ఆ ప్రాంతమంతా మోడీ నామ స్మరణతో మార్మోగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన త్రివర్ణ పతాకాల రెపరెపలతో, ఒక మహోన్నత నేతను చూస్తున్నామన్న సంతోషసంరంభాలతో ఆ ప్రాంతం కళకళలాడిపోయింది. మోడీ వేదిక వద్దకు రాగానే ప్రజలంతా ఉప్పొంగిపోయి మోడీ..మోడీ అంటూ చేసిన నినాదాలు, హర్షధ్వానాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. దాదాపు 21వేల మంది కూర్చునేందుకు వీలున్న ఆ ఎరీనా మొత్తం నిండిపోయి, ఇంకా పెద్దసంఖ్యలో ప్రజలు వెలుపలనే వుండిపోయి, మోడీ రాకకోసం నిరీక్షించారంటే మోడీపై ప్రజలకున్న ఎనలేని ఆత్మీయతకు..అభిమానానికి అది ఒక నిలువెత్తు నిదర్శనం.

అందుకు తగ్గట్టుగానే ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగం అక్కడి ప్రజలను ఉర్రూతలూగించింది. ఆయన మాట్లాడిన ప్రతిమాటా ప్రజల కరతాళధ్వనులందుకుంది. అచంచలమైన.. పరిపూర్ణమైన దేశభక్తితో, భారత దేశప్రజలకు సేవ చేయాలనే ప్రగాఢమైన ఆకాంక్షతో ఆయన చెప్పిన ప్రతిమాటా జయజయధ్వానాలందుకుంది. 'దేశ ప్రయోజనాల కోసం మనకు సాధ్యమైనంతవరకూ పనిచేద్దాం..ఆ తర్వాత యావత్ మానవాళి లబ్ది కోసం మన దేశం పనిచేస్తుంది'..అని ఆయన పిలుపునిచ్చినప్పుడు, ఆస్ట్రేలియాలోని ప్రవాసభారతీయులంతా పెద్దఎత్తున స్పందించి ఆయనకు జేజేలు పలికారు. 'దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడే అదృష్టం మనకు దక్కలేదు. దేశం కోసం మన ప్రాణాల్ని ఇవ్వలేకపోయాం. కానీ, ఇప్పుడు మన దేశం కోసం మనం జీవించవచ్చు. భారత్ కోసం జీవిద్దాం. భారత్ కోసం పోరాడుదాం. నేడు 125 కోట్ల మంది భారతీయులు ఈ కలను పంచుకుంటున్నారు'..అని ప్రధాని ఎంతో ఉద్వేగంగా అన్న మాటలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారత ప్రజానీకం ఆకాంక్షలను నిజం చేయడానికి ప్రస్తుతం నెలకొన్న ఆశావహ వాతావరణాన్ని ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వున్న భారతీయులకు చేసిన విజ్ఞప్తి.. ప్రజల హృదయాల్లో స్ఫూర్తిని నింపింది. భారతదేశం మరోసారి విశ్వగురువు పాత్రను పోషించాలన్న స్వామీ వివేకానందుని స్వప్నం తప్పకుండా నిజమవుతుందన్నారు. ఈ పర్యటన సందర్భంగా అంతర్జాతీయస్థాయిలో పన్ను సమాచార వెల్లడి, పారదర్శకత వుండి తీరాలన్న వాదనకు జీ-20 సభ్యదేశాల మద్దతును కూడగట్టడంలో ప్రధాని మోడీ విజయం సాధించారు. భారత్‌లో వ్యాపారం సులువుగా చేసుకునేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నామని, అందుకోసం కాలం చెల్లిన చట్టాలను, నిబంధనలను తొలగిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వాధినేతలకు, పారిశ్రామికవేత్తలకు తెలిపారు. భారత్‌లో విద్యుత్, ఖనిజాలు, వ్యవసాయం, ఆహారభద్రత, విద్య, ఆధునిక సాంకేతిక రంగాల అభివృద్ధిలోనూ పాలుపంచుకోవాలని ప్రధాని మోడీ వారికి పిలుపునిచ్చారు. భారత్‌లో తయారీ రంగాన్ని (మేకిన్ ఇండియా) పెంపొందించడానికి కృషి చేస్తున్నామని అంటూ, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు ప్రధాన మోడీ ఆహ్వానం పలికారు.

ఆస్ట్రేలియా ప్రధాని టోనీ అబాట్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్‌కు నమ్మకమైన నేస్తంగా వుంటామన్నారు. విద్యుత్, రక్షణ, ఆహారభద్రతకు సంబంధించి భారత్ ఆధారపడదగిన, నమ్మకమైన నేస్తంగా ఆస్ట్రేలియా వుంటుందన్నారు. అదేవిధంగా, ప్రధాని మోడీ కూడా, ఆస్ట్రేలియాతో తమకున్న అనుబంధం సహజమైనదని, ఇరుదేశాలూ కలిసి పంచుకుంటున్న విలువలు, ఆసక్తుల నుంచి ఈ బంధం ఆవిర్భవించిందని అంటూ, వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో 'మేకిన్ ఇండియా' ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నామని, ఆస్ట్రేలియా కూడా భారత్‌లో వచ్చే ఏడాది జనవరిలో వారం రోజులపాటు వాణిజ్య అంశాలపై కార్యక్రమం నిర్వహించనున్నదని వెల్లడించారు. మరుసటిరోజు ప్రధాని మోడీ తన ప్రసంగంలో, ఉగ్రవాదంపై ప్రపంచం పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం నుంచి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు భారత్-ఆస్ట్రేలియా రక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని కూడా సూచించారు. ప్రపంచ సమస్యగా మారిన ఉగ్రవాదాన్ని ప్రపంచస్థాయిలో సమగ్రమైన విధానాలతో ఎదుర్కోవాలని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఆ మేరకు అటు ఆస్ట్రేలియా..ఇటు భారత్‌లు ఒక అవగాహనకు రావడం హర్షదాయకం. ఏదేమైనా ప్రధాని నరేంద్రమోడీ ఆస్ట్రేలియా పర్యటన ఎంతో సుహృద్భావ వాతావరణంలో..ఎంతో స్ఫూర్తిమంతంగా సాగి విజయవంతమైంది.

# సైకత శిల్పంతో సచిన్‌కు స్వాగతం




క్రికెట్ దిగ్గజం, ఎంపి సచిన్ టెండూల్కర్ నెల్లూరు జిల్లాలోని పుట్టంరాజవారి కండ్రిగ గ్రామాన్ని సందర్శించేందుకు విచ్చేస్తున్నట్లు తెలియగానే, చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్, సచిన్ రూపంలో సైకత శిల్పాన్ని అత్యద్భుతంగా రూపొందించి, ఘనస్వాగతం పలికారు.


ఏరూరు గ్రామ సమీపంలోని సిలికా గనుల వద్ద ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పం స్థానికులందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. పుట్టంరాజువారి కండ్రిగను సచిన్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న విధంగానే, సచిన్ స్ఫూర్తితో ప్రజాప్రతినిధులందరూ మిగిలిన గ్రామాల అభివృద్ధికి తగు చొరవ తీసుకోవాలని సైకత శిల్పి సనత్‌కుమార్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# భగవద్గీత పఠన పోటీల విజేతలు


నెల్లూరు చిన్మయామిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆచార్య స్వామిని నిర్మలానంద పర్యవేక్షణలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-ఏ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా విజిత, సుమశ్రీ, జాగృతి(విశ్వవిద్యానికేతన్ స్కూల్, నెల్లూరు) విద్యార్థులు గెలుపొందారు. గ్రూప్-బి విభాగంలో రవిశంకర్(గాయత్రి స్కూలు, పొదలకూరు), శ్రీవర్షిణి(జివికె చిన్మయ విద్యాలయం, కొత్తూరు), రుషికేష్(విశ్వ విద్యానికేతన్ స్కూలు, నెల్లూరు). గ్రూప్-సి విభాగంలో పి.మేఘన(సాయినాథన్ స్కూల్, వరదాపురం), టి.హరివర్షిత (జివికె చిన్మయ విద్యాలయ, కొత్తూరు), ఎం.తేజశ్రీ(మైథిలి ఇంగ్లీష్‌మీడియం స్కూల్, నెల్లూరు). గ్రూప్-డి విభాగంలో సుచరిత(జడ్పీహెచ్‌ఎస్, పొదలకూరు), నిఖిత(విశ్వ విద్యానికేతన్, నెల్లూరు), అమృత(సాయినాథన్ స్కూల్, వరదాపురం) వరుసగా ప్రథమ బహుమతి రూ.1000లు, ద్వితీయ బహుమతి రూ.800లు, తృతీయ బహుమతి రూ.600లుతో పాటు మెరిట్ సర్టిఫికేట్లు సాధించారు. ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు.

# భారీ ఫలపుష్పలింగం



నెల్లూరుజిల్లా సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా 17వ తేదీ శివభక్తులు కలిసి వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో శివలింగాన్ని ఆలయంలో ప్రత్యేకంగా తయారుచేశారు. వేలాది ఫలపుష్పాలు ఇందుకోసం వినియోగించారు. దీనిచుట్టూ కార్తీక దీపాలను వెలిగించి స్వామివారికి సమర్పించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.




## కాంట్రాక్ట్ ఉద్యోగస్తులకు డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నెల్లూరుజిల్లాలో వివిధ శాఖలలో అక్రమంగా కాంట్రాక్ట్ ఉద్యోగస్థులకు డిప్యూటేషన్‌లు వేస్తారు. అన్ని శాఖలలో డిప్యూటేషన్‌లు రద్దు చేయాలి. జిల్లా మంత్రి నారాయణ గారు స్పందించాలి. ఈ అక్రమాలు నెల్లూరుజిల్లాలో పలు శాఖలలో ఉన్న కొంతమంది కాంట్రాక్ట్ లాంబింగ్ వలన ఈ విధంగా జరిగింది. కాంట్రాక్ట్ ఉద్యోగస్థులకు డిప్యూటేషన్‌లు వేసే అధికారం లేదు. ప్రభుత్వం జిఓని ఎందుకు పాటించడం లేదు. కాంట్రాక్ట్ ఉద్యోగస్థుల జీతాలు చాలా తక్కువ. వారి డిప్యూటేషన్‌లు అంటూ వారి జీవితాలతో చెలగాటం తగదు. జిల్లాలో అక్రమ కాంట్రాక్ట్ డిప్యూటేషన్‌లు రద్దు చేయాలి. ముఖ్యమంత్రి వెంటనే రద్దుకు ఆదేశాలివ్వాలి.

**ఉమ.పి,** గూడూరు.

## అవతరణోత్సవ వివాదం

పనిలేనోడు పిల్లి తల గొరిగాడట. ఇప్పుడు పనిలేని రాజకీయ నాయకులు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని వివాదంగా మార్చారు. తెలంగాణ నుండి విడిపోయిన జూన్2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది సముచితం. తెలంగాణతో కలిసి ఆంధ్ర ప్రదేశ్‌గా ఏర్పడ్డ నవంబర్ 1ని ఇంకా ఎలా జరుపుకుంటాము.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## సింగపూర్ జపం

ముఖ్యమంత్రి చంద్రబాబు నిద్రలేచింది మొదలు సింగపూర్ జపం చేస్తున్నారు. సింగపూర్ వంటి రాజధానిని కట్టడమే తన జీవిత కర్తవ్యమంటాడు. ఇప్పుడు రాష్ట్రానికి రాజధాని అంత ముఖ్యమేమీ కాదు. మంచి సాగుభూములను పాడు చేసే ఈ రాజధాని ఇప్పట్లో రాకున్నా ఇబ్బంది లేదు. ముందు రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్ది ప్రజలకు అవసరమైన పనులు పూర్తి చేయడంపై చంద్రబాబు దృష్టి పెట్టాలి. ఇప్పుడు ఇన్ని దేశాలు తిరగాల్సిన అవసరం లేదు.

**కె.ఎల్.ఎన్.శర్మ, గుంటూరు.**

## మేడిపండు చూడు...

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన 'స్వచ్ఛభారత్' కార్యక్రమం వలన భారత్ మేడిపండు లాగా మేలిమై ఉంటుంది. కానీ పండులోని పురుగుల సంగతేంటి? ఎర్రగడ్డ తరిగితే కళ్లకు నీళ్లు రాని ఎర్రగడ్డలను శాస్త్రజ్ఞులు రూపొందించినట్లు, పురుగులు(అవినీతి)లేని మేడిపండును(స్వచ్ఛ భారత్)ను ప్రధాని మోడీ రూపొందించాలి. ప్రజలు, పాలకులు మోడీ కార్యక్రమానికి సహకరించాలి.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## ఎయిర్‌పోర్టు రానూరాదు... విమానం ఎగరనూ ఎగరదు...!



## రియల్టర్ ఆశలపై...

# నీళ్లు కుమ్మరించిన వెంకయ్య

జిల్లాలో వెర్రితలలు వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం నాలుగేళ్లుగా పడుకుని ఉంది. ఈ రియల్ ఎస్టేట్‌లోనే కోట్లు సంపాదించిన వ్యాపారులు అదే రంగంలో కోట్లాదిరూపాయలు వడ్డీలు కట్టారు. వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నవాళ్లు, ఐపి పెట్టిన వాళ్లు కూడా ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అయినా నెల్లూరులో రియల్ మార్కెట్ కదులుతుందని చాలామంది ఆశపడ్డారు. కాని తెలుగుదేశం అధికారంలోకి రావడం, విజయవాడ వద్ద రాజధానిని పెట్టడంతో ఆ ఆశ కూడా లేకుండాపోయింది. జగన్ సీఎం అయ్యుంటే నెల్లూరుజిల్లాలో రియల్టర్ల పరిస్థితి ఆశాజనకంగానే ఉండేది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, ఈ జిల్లాలో ఆయనకు తక్కువ సీట్లు వచ్చాయని చెప్పి ఆయన ఈ జిల్లా అభివృద్ధిపై సీతకన్నేయడంతో రియల్ వ్యాపారం దారుణంగా పడిపోయింది. అరకొర ఆశలు జిల్లా మనిషయిన వెంకయ్యనాయుడు మీదే పెట్టుకున్నారు. నెల్లూరును స్మార్ట్‌సిటీగా ప్రకటిస్తే కొంచెమన్నా కదలికి వస్తుందనుకున్నారు. అయితే కేంద్రం ప్రకటించిన స్మార్టుసిటీల జాబితాలో నెల్లూరుపేరు లేకపోవడంతో నీరుగారిపోయారు. ఇప్పుడు మళ్ళీ చేర్చారనుకోండి.

జిల్లాలో రియల్ వ్యాపారులకు ఒక ఆశాకేంద్రం విమానాశ్రయం. గత కొన్నేళ్లుగా ఇది నెల్లూరీయులను ఊరిస్తూనేవుంది. వై.యస్. ముఖ్యమంత్రిగా వున్నప్పుడే దామవరం వద్ద ఎయిర్‌పోర్టు కోసం భూమిని సేకరించారు. ఇక ఎయిర్‌పోర్టు నిర్మాణానికి టెండర్లు పిలవాలనుకుంటున్న దశలో అర్థాంతరంగా ఆగిపోయింది. ఇప్పుడు చంద్రబాబు జిల్లాకు ఒక ఎయిర్‌పోర్టు కడతానని చెబుతున్నాడు. అయితే ఇవన్నీ ఇలా ఉండగానే మొన్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మాత్రం నెల్లూరుకు ఎయిర్‌పోర్టు వచ్చే అవకాశమే లేదని కొట్టిపారేశారు. దగ్గరలో చెన్నై, రేణిగుంట ఎయిర్‌పోర్టులుండగా నెల్లూరుకు ఎయిర్‌పోర్టు అవసరం ఏముందని, ఏ మాత్రం ఎయిర్‌పోర్టుకు అవకాశం లేదని చెప్పడంతో రియల్టర్ల ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లినట్లయ్యింది.

# ఆర్టీసీ మార్పుకు గ్రీన్‌సిగ్నల్?

## అమలు జరిగితే... నగరంలో ట్రాఫిక్ సమస్య తీరినట్లే!



నెల్లూరు నగరంలో 80 శాతం ట్రాఫిక్ అయ్యప్ప గుడి-ఆత్మకూరు బస్టాండ్‌ల మధ్య ట్రంకురోడ్డు మీదే నడుస్తుంది. ఈ రోడ్డు మీదే ఇంత ట్రాఫిక్ ఉండడానికి ప్రధాన కారణాలలో ఆర్టీసీ బస్టాండ్ ఒకటి, రైల్వేస్టేషన్ రెండోది. రైల్వేస్టేషన్‌ను మార్చడం ఎలాగూ సాధ్యమయ్యేపనికాదు. కాని ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చడం మాత్రం జరిగేపనే! కాని ఇంతవరకు దానికి ఎవరూ నడుంకట్టలేదు. దాదాపు పదేళ్లుగా ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌ను నగర శివార్లకు తరలించాలనే ప్రతిపాదన వుంది. కలెక్టర్లుగా అనంతరాము, ప్రవీణ్‌కుమార్‌లు ఉన్నప్పుడే దీనిపై చర్చ జరిగింది. ఆర్టీసీ బస్టాండ్‌ను ఇప్పుడు శిల్పారామం కడుతున్న బుజబుజనెల్లూరు చెరువు ప్రాంతానికి గాని లేదా ఆర్టీవో కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలం ఉంది కాబట్టి అక్కడికి గాని మార్చాలనే ప్రతిపాదన వుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ప్రతిపాదన బుట్టదాఖలైంది. బస్టాండ్‌ను ఇక్కడున్న ప్రాంతం నుండి తరలించడానికి ముఖ్యంగా ఆనం సోదరులు ఒప్పుకోలేదు.

అయితే తాజాగా ఆర్టీసీ బస్టాండ్ తరలింపుపై సానుకూల సంకేతాలు వచ్చాయి. నెల్లూరు నగరాభివృద్ధిపై దృష్టి పెట్టిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ట్రంకురోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. అలాగే నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గాలంటే ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చాల్సి వుందన్న విషయాన్ని ఆయన గుర్తించారు. గతంలో 'లాయర్' పలుమార్లు నగరంలో ట్రాఫిక్ సమస్యకు ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చడమే మార్గమని సూచించింది. ముఖ్యంగా చెన్నైలోని కోయంబేడు బస్టాండ్‌ను ఉదాహరణగా చూసారు. చెన్నైలో ప్రధాన బస్టాండ్‌ను కోయంబేడులో నెలకొల్పినందు వల్ల చెన్నైలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వుంది. ప్రయాణీకులకు కూడా సౌకర్యంగా వుంది. అదే పాత బస్టాండే వుంటే చెన్నై శివార్ల నుండి బస్టాండ్‌కు పోవడానికి రెండుమూడు గంటలు సులభంగా పడుతుంది.

నెల్లూరులో కూడా ఇదే ఫార్ములాను పాటించాలని వెంకయ్యనాయుడు ఆర్టీసీ అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఆర్టీసీ బస్టాండ్ మార్పుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయమని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ మార్పుకు ఆ సంస్థ అధికారులు కూడా సిద్ధంగా వున్నారు. నగర శివార్లలో బస్టాండ్ వుంటే వాళ్లు దగ్గర గ్రామాలకు అదనంగా సర్వీసులను నడపవచ్చు. కాలం ఆదా కావడంతో పాటు ఆయిల్ ఖర్చు తగ్గి రాబడి పెరుగుతుంది. ముఖ్యంగా నెల్లూరు నగరం రోడ్ల మీద ఒత్తిడి తగ్గిపోతుంది. నెల్లూరులోని రెండు డిపోలలో వున్న 800బస్సులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల బస్సులు కలిపి దాదాపు రెండువేల బస్సులు నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బస్సులన్నీ నగరంలోకి రాకపోతే ట్రాఫిక్ చాలావరకు తగ్గుతుంది. ఇక బస్టాండ్ మారిస్తే ట్రంకు రోడ్డు మీద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి మినీబైపాస్, పొదలకూరు రోడ్డుల మీద ట్రాఫిక్ పెరుగుతుంది. అంతేగాక ఆర్టీసీ బస్టాండ్ కట్టేచోట ఖచ్చితంగా అభివృద్ధి మొదలవుతుంది. ఈ ప్రాంత పరిసరాలు అభివృద్ధి చెందుతాయి. వెంకయ్యనాయుడు చొరవ తీసుకుంటే ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చే పని త్వరలోనే పూర్తికాగలదు.

# స్టాండ్స్‌పై కూరగాయల పెంపకం

***కూరగాయల ధరలు మండిపోతున్న నేటి రోజుల్లో, ఆ కూరగాయలను మనమే పండించు కోగలిగితే, కొంతైనా వెసులుబాటుగా వుంటుంది కదా?.. అయితే, అందుకు అనువైన స్థలం మనకు వుందా అనేది పెద్ద ప్రశ్న కావచ్చు. ముఖ్యంగా, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి, స్థలం అనేది పెద్ద సమస్య. అందులోనూ అద్దె ఇళ్ళలో వున్నవారికి, దీనికి అనువైన స్థలం లేకపోవడం మరింత సమస్య. వీటన్నిటిని దృష్టిలో వుంచుకుని ప్రఖ్యాత శాస్త్రవేత్త, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డా.ఎ.జగదీష్ ఒక వినూత్నప్రక్రియను మనందరికీ అందుబాటులోకి తెచ్చారు. అదే స్టాండ్స్‌పై కూరగాయల పెంపకం.***

**- డా.ఎ. జగదీష్**
**మరో వినూత్న ప్రక్రియ**



ఇటీవలి కాలంలో నిటారు వ్యవసాయం (వర్టికల్ ఫార్మింగ్)పై జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ విధానాన్ని విదేశాలు పెద్దఎత్తున అమలు చేస్తున్నాయి. నిటారు వ్యవసాయం వల్ల చాలా లాభాలున్నాయి కూడా. కూరగాయలు మన పరిసరాల్లోనే లభిస్తాయి. తాజాగా కూడా వుంటాయి. కుండీల్లో కూరగాయలను పెంచడం వల్ల నీటి ఆదా చాలా తక్కువగా వుంటుంది. డాక్టర్ జగదీష్ రూపొందించిన 'అందరికీ అందుబాటులో కూరగాయలు' పద్ధతిలో, సుమారు ఆరు అడుగులు ఎత్తు వున్న ఇనుప స్టాండ్‌కు మూడు అంచెల్లో మూడు ఇనుప రింగ్‌లు (అడుగు వ్యాసం) అమర్చుకోవాలి. స్టాండ్ కింద, బరువు మోయగల గుండ్రని ఇనుపచట్రం వుంటుంది. తుప్పు పట్టకుండా ఈ ఇనుప చట్రానికి రెడాక్సైడ్ పెయింట్ వేయాలి. ఈ 9 ఇనుప రింగ్‌లలో ప్లాస్టిక్ కుండీలు (దాదాపు అడుగు వ్యాసం) మట్టితో, సహజ ఎరువు (పేడ)తో నింపి, ఇనుప రింగ్‌లలో దించాలి. ఆ కుండీల్లో కలుపు నివారణ కోసం, నీటి ఆవిరిని తగ్గించేందుకు నల్లటి, పల్చని కాన్వాస్‌ను కుండీ చుట్టూ (మధ్య 4 అంగుళాల రంధ్రం చేసి) ప్లాస్టిక్ తాడుతో బిగించాలి.

ఈ కుండీల్లో మనకు కావాలనుకున్న కూరగాయల విత్తనాలను వేసుకోవాలి. విడిగా నారుపోసి కూడా, ఆ మొక్కలను కుండీల్లో నాటుకోవచ్చు. ఈ పద్ధతిలో పూలమొక్కలను కూడా పెంచుకోవచ్చు.

కుండీలను నిటారు స్టాండ్‌పై అమర్చడం వల్ల, వాటికి కేవలం ఒక చదరపు అడుగు స్థలం సరిపోతుంది. ఈ పద్ధతిలో కుండీలలో నీళ్ళు పోయడం కూడా సులువుగానే వుంటుంది. మూడు అంచల్లో కుండీలు దూరంగా వుంచడం వల్ల కూరగాయల మొక్కలు పెరిగేందుకు అవకాశం వుంటుంది.

ప్రస్తుతం దేశ, విదేశాల్లో ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ప్రాముఖ్యత ఇస్తున్నారు. సహజ ఎరువులు వేసి పెంచిన కూరగాయలు పౌష్టికాహారాన్ని అందించడమే కాక, మొక్కలను తెగుళ్ళు ఎక్కువగా ఆశించవు. ఈ పద్ధతిలో ఇనుపస్టాండ్, రింగ్‌లు, ప్లాస్టిక్ కుండీలు



అన్నీ కలసి కేవలం రెండు వేల రూపాయల లోపే ఖర్చవుతుంది. ఈ స్టాండ్‌ను చిన్నచిన్న వెల్డింగ్ షాప్‌లలో తయారుచేయించుకోవచ్చు. ఈ నిటారు వ్యవసాయాన్ని ఇజ్రాయిల్, అమెరికా దేశాల్లో బాగా ఎక్కువగా చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం దీనిని గమనించి, ఈ విధానాన్ని ప్రోత్సహిస్తే, తక్కువ వ్యయంతో తాజా కూరగాయాలు అందుబాటులోకి తెచ్చుకోవచ్చు.

### ఈ పద్ధతి వల్ల లాభాలు :

- ఎక్కువ స్థలం అవసరం లేదు
- తాజా కూరగాయలను పండించుకోవచ్చు
- కుండీల్లోని మొక్కలకు ఎక్కువ నీరు అవసరం లేదు.
- కుండీలు పెట్టుకునే ఇనుపస్టాండ్‌ను చిన్న వర్క్‌షాప్‌లలో తయారుచేయించుకోవచ్చు
- ప్లాస్టిక్ కుండీలు అందంగా వుండడమే కాక,బరువు తక్కువ
- కుండీలకు అడుగున చిన్న రంధ్రాలు వేయడం వల్ల ఎక్కువైన నీరు క్రింది కుండీల్లో పడుతుంది. అందువల్ల నీరు వృథా కాదు.
- పెట్టుబడి తక్కువ. కేవలం రూ. 2వేలకే అందుబాటులో వుంచుకోవచ్చు
- డ్వాక్రా సంఘాలు ఈ పద్ధతిని మహిళాసంఘాల ద్వారా ప్రచారం చేసి బాగా లాభాలు పొందవచ్చు
- పెట్టిన పెట్టుబడిని ఏడాది లోగానే రాబట్టుకోవచ్చు
- అవసరాన్ని బట్టి ఈ స్టాండ్స్‌లో కుండీలు పెట్టే రింగ్‌లను పెంచుకోవచ్చు

# కొత్త డిఇఓగా ఆంజనేయులు

దాదాపు ఎనిమిది నెలలుగా ఖాళీగా వున్న జిల్లా విద్యాశాఖాధికారి పదవిని ఎట్టకేలకు భర్తీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు గుంటూరు జిల్లా డిఇఓగా పనిచేస్తున్న దొండు ఆంజనేయులును జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డిఇఓ మువ్వా రామలింగంపై ఆరోపణలు రావడంతో, ఆయన సస్పెన్షన్‌కు గురికావడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన బదిలీల్లో గుంటూరు డిఇఓ ఆంజనేయులును ఇక్కడికి బదిలీ చేశారు. ఆంజనేయులు గతంలో ఇక్కడ పనిచేశారు. డైట్ ప్రిన్సిపల్‌గా 2007 నుంచి 2010దాకా జిల్లాలో పనిచేసిన అనుభవం వుంది. 2009-2010లో ఇన్‌ఛార్జి డిఇఓగా కూడా పనిచేశారు. కొత్త డిఇఓ రాకతోనైనా జిల్లా విద్యాశాఖ పనితీరు మెరుగుపడుతుందని ఆశిద్దాం!

## ఇంటెలిజెన్స్ డిఎస్పీగా ప్రభాకర్

ఇంటెలిజెన్స్ డిఎస్పీగా ప్రభాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరుజిల్లాలోని తోటపల్లిగూడూరుకు చెందిన ప్రభాకర్ 1991 బ్యాచ్‌కు చెందినవారు. ప్రకాశంజిల్లా ఒంగోలు, చీరాల, అద్దంకి, కందుకూరు ప్రాంతాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. 2003లో సిఐగా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి ఏసిబిలో టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. డిఎస్పీగా పదోన్నతి రావడంతో నెల్లూరు ఇంటెలిజెన్స్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

# వాకర్స్... హెల్త్‌మేకర్స్




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా వాకర్స్ అంతర్జాతీయ సంస్థ కృషి చేస్తుందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 16వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో అంతర్జాతీయ సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నడకపట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ఇస్తున్న ప్రాధాన్యత పలువురిలో స్ఫూర్తి నింపుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను కల్తీ బారిన పడకుండా కాపాడేందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. వాకర్స్ గవర్నర్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నడకపట్ల మూడుజిల్లాల్లో అవగాహన కల్పించామన్నారు. 65క్లబ్‌లు స్థాపించడంతో పాటు రూ.5లక్షలు అంతర్జాతీయ ఫండ్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ అధ్యక్షుడు పివిపి రాజు, సమావేశ కమిటీ ఛైర్మెన్ సురేష్‌బాబు, కార్యదర్శి ఎం.వి.రెడ్డి, కోశాధికారి రామసుబ్బారెడ్డి, వాకర్స్ గవర్నర్ మోహనరావు, ఏరియా కో-ఆర్డినేటర్ పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

## అమీర్‌జాన్‌కు ప్రతిభా పురస్కారం

శ్రీ అజంతా కళారామం, తెనాలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీలలో నెల్లూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ చిత్రానికి శ్రీఅజంతా కళారామం జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం తెనాలిలోని పుట్టి కోటేశ్వరరావు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అమీర్‌జాన్ అందుకున్నారు. ఆర్టు కాన్వాస్‌పై యక్రలిక్ రంగులతో భారతీయ నాగరికత అభివృద్ధిపై చిత్రించిన "మేకిన్ ఇండియా" చిత్రానికి ఈ అవార్డు దక్కింది.

## శబరిమలైకి ఆర్టీసీ బస్సులు

శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్పస్వాములకు శబరిమలైలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ నెల్లూరు రీజియన్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు నుంచి శబరిమలైకి వెళ్లే ఆర్టీసీ బస్సులను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీటీఎం చంద్రశేఖర్, సిఎం శేషయ్య, రెండవ డిపో మేనేజర్ షమీమ్, వీరస్వామి, సిఆర్‌సిలు పాల్గొన్నారు.

## పడిపోయిన మాంసం మద్యం అమ్మకాలు

కార్తీకమాసం దెబ్బకు జిల్లాలో మాంసం, మద్యం అమ్మకాలు బాగా పడిపోయాయి. కార్తీకమాసం సందర్భంగా చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. మద్యపాన ప్రియులు ఎక్కువమంది ఈ నెలరోజులు మందు మానేస్తారు. దీంతో ఈ రెండురకాల వ్యాపారాలకు ఈ నెలంతా షాకే! ప్రతిఏటా కార్తీకమాసాన ఈ రెండింటికి దూరమయ్యేవారు అంతకంతకు పెరుగుతుండడం విశేషం. ఈ నెల 22తో కార్తీకమాసం ముగియనుండడంతో ఆ తర్వాత నుండి రెండురకాల వ్యాపారాలు మళ్ళీ పుంజుకునే అవకాశాలున్నాయి.

# నెల్లూరు కబుర్లు

## సందడి చేసిన విఐపిలు

ఈ వారంలో విఐపిలు నెల్లూరుజిల్లాలో బాగానే సందడి చేశారు. గూడూరు మండలం పుట్టంరాజువారికండ్రిగ గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి ప్రపంచ మేటి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రావడం జరిగింది. 15వ తేదీ జిల్లాకొచ్చిన ఆయన 16వ తేదీ వెళ్లిపోయారు. నెల్లూరులో సర్దార్‌వల్లభాయ్‌పటేల్ విగ్రహావిష్కరణ కోసం కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు 15న నెల్లూరు రాగా, అదేరోజు రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కామినేని శ్రీనివాస్‌లు కూడా వచ్చారు.

## వృద్ధాశ్రమం వార్షికోత్సవం




జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ తన సొంత ఖర్చుతో సేవాదృక్పథంతో నిర్వహిస్తున్న జొన్నవాడలోని ప్రియదర్శిని అనాథ వృద్ధుల ఆశ్రమం నెలకొల్పి ఏడేళ్లు దాటి ఎనిమిదో ఏట అడుగు పెట్టింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అరుణమ్మ ఆమె కుటుంబసభ్యులు కలిసి ఆశ్రమంలోని వృద్ధులకే కాక కామాక్షమ్మ ఆలయ పరిసరాలలో ఉండేవారికి కూడా కొత్తబట్టలు ఇచ్చిన తమ తల్లిదండ్రుల మాదిరిగానే వారిని గౌరవించారు.

## జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రత్నం విద్యార్థులు

ఉదయగిరిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరులోని రత్నం ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులు తమ అమోఘమైన ప్రతిభను కనబరచి, జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో (అండర్-14) పి. భవాని, అండర్-17 బాలుర విభాగంలో శివచంద్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థులు వారికి తమ అభినందనలు తెలిపారు. అదేవిధంగా, రత్నం విద్యాసంస్థల డైరెక్టర్, పిఇటి చిట్టితో పాటు, పలువురు ఉపాధ్యాయులు ఆ క్రీడాకారులను అభినందించారు.

## దారికొచ్చిన పెద్దాసుపత్రి జబ్బు

నెల్లూరు దొడ్డ సుబ్బారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో ఇక నుంచి రోగులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగిన ఆసుపత్రి 14వ తేదీ నుంచి రాష్ట్ర వైద్యవిద్యా మండలి పరిధిలోకి వచ్చింది. ప్రభుత్వ జివో నెంబరు 138 ప్రకారం ఇక నుంచి డిఎస్ఆర్ ప్రభుత్వాసుపత్రి, జూబ్లీ ఆసుపత్రి, రేబాల చిన్నపిల్లల ఆసుపత్రి, క్షయ ఆసుపత్రి, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు వైద్యకళాశాలలోకి అనుబంధమయ్యాయి.

## కార్తీకదీప నృత్యనీరాజనం

**కనువిందు చేసిన గురుకృప కళాక్షేత్రం విద్యార్థుల నృత్యాభినయం**



కార్తీకమాసం సందర్భంగా నృత్య కళాకారులు పరమేశ్వరునికి కార్తీకదీప నృత్యంతో నీరాజనాలు సమర్పించి కనువిందు చేశారు. నెల్లూరు కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో శ్రీ గురుకృప కళాక్షేత్రం ఆధ్వర్యంలో 16వ తేదీ కార్తీకదీప నృత్యనీరాజనం వైభవంగా జరిగింది. కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పటివరకు దేశంలో ఎక్కడా ప్రదర్శించనటువంటి విధంగా కళాక్షేత్రం విద్యార్థులు 150మంది దాదాపు ఒకటిన్నర గంటసేపు నృత్యార్చన, పుష్పాంజలి, శివాష్టకం, శివపంచాక్షరి, శివోహంలకు చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభిగాయత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరమేశ్వరునికి, నటరాజ స్వామిలకు విశేషపూజలు నిర్వహించారు. తొలుత జ్యోతిప్రకాశాన్ని సురభిగాయత్రి, శివకుమార్, మనుబోలు ప్రభాకరరావు, కళాంజలి అనంత్, కల్పన, ఎం.సుందరం గావించారు. కార్తీకదీపాల వెలుగుల నడుమ సాగిన ఈ నృత్యాభినయాన్ని తిలకించేందుకు ప్రేక్షకులు విశేషంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, బి.వి.నరసింహం, సి.మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ వైద్యాలయం పేద ప్రజలకు అందిస్తున్న సేవలకు స్పందించి దాతలు వైద్యాలయ అభివృద్ధికి తమవంతు విరాళాలందిస్తున్నారు. 15వతేదీ నెల్లూరు రేబాలవారి వీధికి చెందిన వి.సీతారామమ్మ, వి.రాధమ్మలు తమ తల్లి విడవలూరు రమణమ్మ స్మృత్యర్థం రూ.2.50లక్షల విరాళం అందించారు.

## డిఆర్‌డిఏ పిడిగా ప్రసాద్

నెల్లూరుజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడిగా ఒంగోలు ఆర్డీఓ ప్రసాద్‌ను నియమించినట్లు తెలిసింది. ఇక్కడ పనిచేస్తున్న పిడి చంద్రమౌళి చిత్తూరు జిల్లా పరిషత్ సిఇఓగా బదిలీ అయ్యారు.

## రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌రావు

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరు రెవెన్యూ ఉద్యోగి వై.మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో 13జిల్లాల నుంచి 20మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో నెల్లూరుజిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా వై.మధుసూదన్ రావును ఎన్నుకున్నారు.

## ఏబివిపి జాతీయ కమిటీ కార్యవర్గసభ్యుడిగా ఈశ్వర్

అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి) నెల్లూరు, ప్రకాశం జిల్లాల సంఘటనా కార్యదర్శిగా పనిచేస్తున్న ఈశ్వర్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యాడు. పంజాబ్ అమృత్‌సర్‌లో జరుగుతున్న ఏబివిపి 60వ జాతీయ మహాసభల్లో ఈశ్వర్‌ను జాతీయ కార్యవర్గసభ్యుడిగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షులు డాక్టర్ నగేష్‌ఠాగూర్ ప్రకటించారు.

## ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్‌రావు

ఎన్జీఓ అసోసియేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా సిహెచ్‌వీ ఆర్సీ శేఖర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు ఎన్జీఓ హోంలో ఆదివారం ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి, ఎన్నికల పరిశీలకుడు వీరేంద్రబాబుల సమక్షంలో శేఖర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శేఖర్‌రావు 2007 నుంచి ఇప్పటివరకు ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా, నగర కార్యదర్శిగా, నగర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డికి అభినందనలు

జిల్లా రెవెన్యూ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.సుదర్శన్‌రెడ్డికి విఆర్‌ఓల సంఘంవారు అభినందనలు తెలియజేశారు. ఈ నెల 15న కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో వారు సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విఆర్‌ఓల సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దారా వెంకటరమణయ్య, ఉపాధ్యక్షులు బండి రాములు, ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు మండల కార్యదర్శి సోమయాజులు, విఆర్‌ఓలు రమేష్, గున్నయ్య, తిరుపతి రాజు, నాగేశ్వరరావు, చిన్నారావు, సురేఖ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రటరీజనరల్‌కు

# నాయుడమ్మ అవార్డు - 2014 ప్రదానం



డా.నాయుడమ్మ అవార్డు-2014ను యెమ్‌కుల్లాకు బహుకరిస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు



డా.నాయుడమ్మ రూరల్ డెవలప్‌మెంట్ అవార్డును శ్రీమతి దీపా వెంకట్‌కు బహుకరిస్తున్న యెమ్‌కుల్లా

ప్రముఖ అంతర్జాతీయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వై.నాయుడమ్మ జ్ఞాపకార్థం ఏటా అందించే నాయుడమ్మ అవార్డును ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రటరీ జనరల్ డాక్టర్ కె.యెమ్‌కుల్లాకు కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ నెల 13వ తేదీన ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ డా.నాయుడమ్మ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్త అని, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసించారు. అవార్డు గ్రహీత డాక్టర్ యుమ్‌కెల్లా 20వ నాయుడమ్మ స్మారకోపన్యాసం చేస్తూ, ముమ్ముందు ఎదుర్కోవాల్సిన ఇంధన సంక్షోభానికి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను విరివిగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. డా. నాయుడమ్మకు యునిడోతో గతంలో వున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. డా.జగదీష్ తన ఉపన్యాసంలో, నాయుడమ్మ అవార్డు తొలినుంచి ఎంత ప్రాధాన్యత సంతరించుకున్నదో వివరించారు. ఇప్పటిదాకా ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును 19 మంది విఖ్యాత శాస్త్రవేత్తలకు అందించామని ఆ వివరాలు వెల్లడించారు. కె.యెమ్‌కుల్లా సన్మానపత్రాన్ని డా.జగదీష్ చదివి వినిపించారు.

### దీపా వెంకట్‌కు డా.నాయుడమ్మ రూరల్ డెవలప్‌మెంట్ అవార్డు

సామాన్య మానవునికి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుండాలని తపించిన డా.నాయుడమ్మ స్మృతి చిహ్నంగా ఈ ఏడాదినుంచి డా.నాయుడమ్మ రూరల్ డెవలప్‌మెంట్ అవార్డును నెలకొల్పినట్లు డా.ఎ.జగదీష్ ఈ సందర్భంగా తెలిపారు. అవార్డును తొలిసారిగా సమాజసేవాభిలాషతో గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకురాలు, అక్షర విద్యాలయ కరస్పాండెంట్ శ్రీమతి దీపా వెంకట్‌కు డాక్టర్ యెమ్‌కుల్లా చేతుల మీదుగా బహుకరించారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, హైదరాబాద్‌లోని డాక్టర్ సిఆర్ రావ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అల్లం అప్పారావులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.



## నెల్లూరు వైద్య కళాశాలలో

# మంత్రుల తనిఖీ

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, మునిసిపల్ మంత్రి డాక్టర్ నారాయణ ఈ నెల 15న జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆ కళాశాల అభివృద్ధి విషయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది తొలిసంవత్సరం వైద్యవిద్యను ఈ కళాశాలలో ప్రారంభించిన సందర్భంగా, అక్కడ భవన నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిని ఇకనుంచి వైద్యకళాశాలకు అనుసంధానం చేయడం జరిగిందని, ఇకనుంచి డిఎస్ఆర్ ఆసుపత్రి, రేబాల చిన్నపిల్లల ఆసుపత్రి, జూబ్లీ ఆసుపత్రి, టీబి ఆసుపత్రులకు వస్తున్న రోగులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించాలని వారు ఆదేశించారు. ఆ తర్వాత వారు, నగరంలోని దర్గామిట్టలో వున్న క్షయ ఆసుపత్రిని కూడా పరిశీలించారు. రోగుల పరిస్థితిని విచారించారు. ఇక్కడ 60 మంది రోగులకు వైద్యసేవలు అందుతుంటే, కేవలం 20 పడకలు వుండడం సరికాదని, పడకల సంఖ్యను పెంచాలని మంత్రి శ్రీనివాస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రుల వెంట జిల్లాకలెక్టర్ ఎన్.శ్రీకాంత్, కమిషనర్ చక్రధర్‌బాబు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, డిసిహెచ్ఎస్ సుబ్బారావు, టిబి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ, జూబ్లీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లలితాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థసేవలు కరువవుతున్నాయి

*హంపి విరూపాక్ష పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి*

*122మందికి రూ.3.40లక్షలు పంపిణీ*



దేవాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారాయని, విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతికం తదితర రంగాలు నాశనమైపోయాయని, నిస్వార్థ సేవలు కరువయిపోతున్నాయని హంపి విరూపాక్ష పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి ఆవేదన చెందారు. నెల్లూరు ట్రంకురోడ్డు టివియస్ కల్యాణసదన్‌లో 16వ తేదీ రాత్రి జరిగిన ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. సమాజానికి మనం ఏమి చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఆలోచించుకొని తమవంతు కృషి చేస్తే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. చెట్లు, గోమాతలు నిస్వార్థంగా ఎలాంటి ప్రతిఫలాలను అందిస్తున్నాయో గుర్తించాలన్నారు. విద్యార్థులు నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యమే వారికి మార్గదర్శనం చేసి ముందుకు నడిపిస్తుందన్నారు. టివియస్ కల్యాణసదన్ ఆధ్వర్యంలో పేదవిద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 122మంది విద్యార్థులకు రూ.3,40,500లు ఉపకారవేతనాలుగా స్వామి అందజేశారు.

టివియస్ కల్యాణ సదన్ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వయంపాకుల శ్రీనివాసులు, డాక్టర్ నాగదేవిప్రసాద్, రాళ్లపల్లి రామసుబ్బారావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, డాక్టర్ పిఎస్ఆర్‌కె మూర్తి, విశ్రాంత దేవాదాయ శాఖ సహాయకమిషనర్ యానాదిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# జనంలోకి వస్తున్న మేకపాటి



ఎదుటివారితో కరచాలనం చేస్తే తన స్వర్ణ కరములు ఎక్కడ కందిపోతాయో అన్నట్లుండే నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈమధ్య తన పంథా మార్చారు. తరచూ జనంలో కనిపిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో విధిగా పాల్గొంటున్నారు. అంతేకాదు, అక్కడక్కడా అభివృద్ధి పనుల కోసమంటూ తన ఎంపీ నిధులను కేటాయిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు స్పందించిన ఆయన మర్రిపాడు మండలంలోని కంపసముద్రం గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగింది. ఇక కేంద్రప్రభుత్వం ఆశీస్సులతో పార్లమెంటు లైబ్రరీ కమిటీ ఛైర్మెన్‌గా కూడా నియమితులయ్యారు. ఎంపీగా మేకపాటి ఇప్పుడున్నంత యాక్టివ్‌గా, కలుపుగోలుతనంగా గతంలో లేరు. 2009లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన మేకపాటి, వై.యస్. మరణానంతరం జగన్ పక్షాన నిలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వీడి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. మధ్యలో నెల్లూరు పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో 3లక్షల మెజార్టీతో గెలిచారు. ఆయన ఎంపీగా ఉన్నాడనేగాని గత 5ఏళ్లలో నెల్లూరు జనాలతో ఆయన కలిసింది, అభివృద్ధికి చేసింది చాలా తక్కువ. మొన్న ఎన్నికల్లో ఆ వ్యతిరేకత ఆయనపై పని చేసింది. కాబట్టే 13వేల స్వల్పమెజార్టీతో గెలిచాడు. అప్పటి నుండి కొంచెం జాగ్రత్త పడుతున్నాడు. ప్రజలకు అందుబాటులో వుంటూ ఎవరు పిలిచినా వెళుతూ తనను తాను మార్చుకుంటూ కొత్త మేకపాటిగా కనిపిస్తున్నాడు.

# నిరుపేదల బ్రతుకులను వీధులపాలు చేయొద్దు

*- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి*



నిరుపేదల బ్రతుకులను వీధులపాలు చేయవద్దని, వారి సమస్యలు పరిష్కరించి, ప్రజల అభ్యున్నతికి బాటలు వేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 15న ఆయన ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా, ఉమ్మారెడ్డిగుంట, ఎన్జీఓ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. తమను ఇక్కడ నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తామిక్కడ గత 50ఏళ్లుగా నివాసాలు వుంటున్నామని, అయితే, రైల్వే వారు వచ్చి ఇక్కడి నివాసాలు తొలగిస్తామంటూ మార్కింగ్ రాళ్ళు నాటి వెళ్ళారని వారు ఎమ్మెల్యేకి తమ గోడు విన్నవించుకున్నారు. అందుకు ఎమ్మెల్యే స్పందించారు. ఇక్కడి ప్రజలు ఎంతో నిరుపేదలని, నిత్యం కూలీచేసుకుని బ్రతికే వీరిని తొలగించాలనుకోవడం నిరుపేదలను వీధులపాలు చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, నగర కమిషనర్, రైల్వే ఉన్నతాధికారులు అందరూ కలిసి సమన్వయంతో, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. అవసరమైతే, అన్ని రాజకీయపక్షాలతో కలిసి అఖిలపక్ష కమిటీగా ఏర్పడి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, నిరుపేదలకు అండగా వుంటామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గూడూరు డివిజన్ వార్తలు

## వైభవంగా కార్తీక దీపోత్సవం



గూడూరు పట్టణంలోని శివాలయంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే చివరి సోమవారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కుకున్నారు. యువతులు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి దర్శనానికి క్యూలో గంటల తరబడి నిరీక్షించారు. శివపార్వతులు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి స్వామివారికి పల్లకీసేవను నిర్వహించారు. ఉభయదాతలుగా నెమిలి కోటేశ్వరరావు, పల్లమేటి రమణయ్య, సన్నిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు వ్యవహరించారు. కాగా పటేల్‌వీధిలో ఉన్న సాయిసత్సంగ నిలయంలో కార్తీకమాసం పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మధ్యలో కార్తీకదీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోట సునీల్‌కుమార్, ప్రకాష్‌రావుల దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌కండ్రిగలో మరుగుదొడ్లు కట్టించాలి

### - తహశీల్దార్ వెంకట నారాయణమ్మ



తహశీల్దార్ వెంకటనారాయణమ్మను కలసిన నెర్నూరు సర్పంచ్ బుజ్జా నాగేశ్వరరావు

గూడూరు మండలం, నెర్నూరు పంచాయతీలో వున్న సచిన్ దత్తత తీసుకున్న ఆదర్శగ్రామం పిఆర్ కండ్రిగలో మరుగుదొడ్లు రెండువారాల్లో కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని నెర్నూరు పంచాయతీ సర్పంచ్ బుజ్జా నాగేశ్వరరావును గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ కోరారు. దానికి సర్పంచ్ అలాగే రెండు వారాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేస్తానని తహశీల్దార్‌కు తెలిపారు.

కాగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినోత్సవం జరిగింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భూఆక్రమణలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. భూసమస్యలను పరిష్కరించాలని మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావు తహశీల్దార్‌ను కోరారు. మండలంలోని నెర్నూరు, చెన్నూరు, దివిపాళెం, పోటుపాళెం, విందూరు, పగడాలపల్లి, ఈదలపల్లి, కందలి, చెమిర్తి తదితర గ్రామాలకు చెందిన నిరుపేద ఎస్సీ కుటుంబాలకు చెందిన అర్జీదారులు భూఆక్రమణలకు గురయ్యామని సమగ్రంగా సర్వే జరిపి అర్హులకు అందజేయాలని తహశీల్దార్‌కు విన్నవించారు.

## మహిళా మండలి స్వచ్ఛభారత్



పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన సూచించారు. ఆంధ్రమహిళామండలి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మహిళా మండలి ఆవరణలో ఉన్న చెత్తను ఊడ్చి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు విష్ణువందన, డా॥ టి.రోహిణి, సౌందర్యమ్మ, కె.సీతమ్మ, సారంగం సులక్ష్మి, జీవని, పరమేశ్వరి, స్వర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


## 'శిష్యులే నా ఆస్తి'.. అని సగర్వంగా ప్రకటించిన 'నాగభైరవ'

***కవి కంటే కవిత్వం గొప్పది. కవిత్వం కంటే వ్యక్తిత్వం గొప్పది. వ్యక్తిత్వంతో కవిత్వం భాసిస్తుంది. కవిత్వంతో వ్యక్తిత్వం కలిసినప్పుడు స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది. వ్యక్తిత్వం లేని కవి ఎంత గొప్ప వాడైనా సమాజం గౌరవించదు. నాగభైరవ కోటేశ్వరరావు కవిత్వ వ్యక్తిత్వ శిఖరం. కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని రెండుకళ్ళుగా భావించి, సామాజిక విలువల కోసం పరితపించిన ఆధునిక కవుల్లో అగ్రగామి డా. నాగభైరవ కోటేశ్వరరావు.***

1931 ఆగస్టు 15న ప్రకాశం జిల్లా రావినూతలలో వెంకటసుబ్బారావు-రాఘవమ్మ దంపతులకు జన్మించిన నాగభైరవ, సాధారణ స్థాయి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగారు. డా.నాగభైరవ ఆడంబరాలెరుగని నిరాడంబర సాహితీ చైతన్యమూర్తి. 77 ఏళ్ళ జీవితాన్ని, 50 సంవత్సరాల కవితా సృజనను సామాజిక అనుభవంతో రంగరించి, ఆధునికాంధ్ర సాహిత్యాకాశంలో ఇంద్రధనుస్సులా విరబూసిన అచ్చమైన గ్రామీణ కవి నాగభైరవ.

కవిత్వమే తన చిరునామాగా, వెలుతురును ప్రేమించి, వేకువల్ని స్నానించి, వేలమంది శిష్యుల జీవితాలను వెలిగించిన నిత్యసాహిత్య కవితాస్ఫూర్తి నాగభైరవ. ఆయనలా వ్యక్తుల్ని ప్రేమించడం, శిష్యుల పట్ల ఎల్లలెరుగని ప్రేమను ప్రదర్శించిన మానవీయ కవితామూర్తులు అరుదుగా వుంటారు. స్వయంకృషి ఆలంబనగా, స్వీయ క్రమశిక్షణ సోపానంగా, ఉన్నత వ్యక్తిత్వం ఉపాదేయంగా జీవిత కవిత్వాలను మలచుకుని 'కవిరత్న'గా కీర్తికెక్కారు. డా. నాగభైరవ..కాలం వెంట నడిచిన కవి. కాలం విలువ తెలిసిన కవి. కవిత్వంలో అదును పదును తెలుసుకుని రచనలు చేసిన కృషీవలుడు. పద్యం పాతబడిపోతుందన్న వాదన సరికాదని నిరూపించేందుకు 'గుండక్కమ్మ చెప్పిన కథ', నదీ చెప్పని కథ'..వంటి పద్య కావ్యాలను రసరమ్యంగా రచించి పద్యాన్ని పండించారు. రంగాజమ్మ, కన్నీటి గాథ, కన్నెగంటి హనుమంతు వంటి గేయకావ్యాలను రచించి, గేయానికి గౌరవం తెచ్చారు. కాలానుగుణంగా వచన కవిత్వంతో కరచాలనం చేసి ఒయాసిస్సు, మానవతా సంగీతం, వెలుతురుస్నానం, తూర్పు వాకిళ్ళు, నా ఉదయం, సంతకం, పతాక శీర్షిక, దగ్ధగీతం వంటి కవితా సంపుటాలను ప్రకటించారు. సమకాలీన ప్రక్రియలైన కథ, నవల, విమర్శ, వ్యాసం వగైరాలన్నింటినీ ఆయన సుసంపన్నం చేశారు.

సుమారు మూడున్నర దశాబ్దాలు ఉపాధ్యాయుడిగా, కళాశాల తెలుగు అధ్యాపకుడిగా వేలాది మంది శిష్యులకు ఆరాధ్య గురువుగా, 'శిష్యులే నా ఆస్తి'.. అని సగర్వంగా ప్రకటించిన నాగభైరవ, ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి, అధ్యాపకునిగా పదవీ విరమణ చేశారు. అచ్చమైన తెలుగుతనానికి నిలువెత్తు ప్రతీకా, ఆకర్షణీయమైన వచస్సుతో, అద్భుతమైన వ్యక్తిత్వ నైపుణ్యంతో ప్రవచనం చేసే నాగభైరవను ఆరాధించే అసంఖ్యాక మంది శిష్యులు చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకూ వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉత్తమ అధ్యాపక పురస్కారం' అందుకున్న తొలి తెలుగు అధ్యాపకుడు డా.నాగభైరవ.



నాగభైరవ కీర్తికిరీటం కవన విజయం. 20వ శతాబ్దపు సాహిత్య కవితోద్యమాల తీరుతెన్నుల్ని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించే సాహితీరూపకం అది. 400కు పైగానే ప్రదర్శనలు పొందింది. ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాలతోబాటు, మారుమూల పల్లెటూళ్లలో సైతం కవుల, సాహితీవేత్తల ప్రశంసలనందుకుంది.

డా.నాగభైరవ ప్రతిభను గుర్తించి శ్రీ ఎన్‌టిఆర్ తన బ్రహ్మర్షి విశ్వామిత్ర చిత్రానికి స్క్రిప్ట్ రైటర్‌గా ఆహ్వానించారు. దేవతలారా దీవించండి..లాంటి చిత్రాలకు ఆయన పాటలను అందించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ పదవుల్లో వారి సేవలను ఉపయోగించుకుంది. తెలుగు పాఠ్యగ్రంథాల రచనా నిర్ణాయక కమిటీ ఛైర్మన్‌గా, తెలుగు విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడెమీ, అధికార భాషాసంఘం, ఫిల్మ్ సెన్సార్‌బోర్డు, దూరదర్శన్ స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించిన నాగభైరవ, ఆ పదవులకే వన్నె తెచ్చారు. సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలకు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డి.లిట్) తో సత్కరించింది. ఆయన ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందారు. రాజాలక్ష్మీ ఫౌండేషన్ పురస్కారం లాంటివి ఎన్నో పొందారు.

గుప్పెళ్ళతో కవిత్వపు పుప్పొడిని, ఆత్మీయతను వెదజల్లిన నాగభైరవ వాత్సల్యానికి మారుపేరు. ఆ మహనీయుని మరణం (2008 జూన్ 14)తో ఆంధ్రదేశం నివ్వెరపోయింది. 'కొత్త కలాలు' వెక్కివెక్కి ఏడ్చాయి. ఆయన స్థానం సాహిత్యంలో సుస్థిరమైన ప్పటికీ, నిత్యం ఆయన స్ఫూర్తి అజరామరంగా నిలవాలని, ఆ స్ఫూర్తి లోంచి కొత్త కవులు వెల్లువలు కావాలని డా. నాగభైరవ అవార్డు కమిటీ వెలిసింది.

మనుషుల్ని ఆయన ప్రేమించేవారు. ఆయనలా అభిమానించేవారు అరుదుగా జన్మిస్తారు. ఎన్టీఆర్ అన్నట్లుగా, 'భావోద్వేగ దీపికా మాలికా సురుచిర రచనా విధానం మీ కవితా సంవిధానం'.. అన్న నాగభైరవ కవిత్వాన్ని ఎల్లవేళలా లోకానికి గుర్తు చేయాలనే సత్సంకల్పం మరోపక్క డా. నాగభైరవ అవార్డు వెలుగొందడానికి కారణం.

ఎందరికో స్ఫూర్తిప్రదాతగా నిలచిన ఆ స్ఫూర్తిమూర్తి సాహిత్యం సాహితీ వికాస బాటన పయనించేలా కృషి చేయాలని మా కమిటీ తపన. అందుకే ఆయన పేరున విశిష్ట అవార్డులను లబ్ధప్రతిష్టులైన కవులకు ఇస్తున్నాం. ఆంధ్రదేశంలో కవిత్వానికి పోటీ పెట్టి ఉత్తమ కవితా సంపుటాలకు నాగభైరవ ఉత్తమ కవితా అవార్డును ప్రదానం గావిస్తున్నాం. గత ఏడాదినుంచి, సాహిత్యంలో కృషి చేస్తున్న కవులకు స్ఫూర్తి అవార్డులను ప్రవేశపెట్టాం. పద్య కవులనూ ప్రోత్సహించాం. కీ.శే నాగభైరవ కోటేశ్వరరావు పలు కవితాప్రక్రియల్లో రాణించారు. అదేవిధంగా, ఆయన స్ఫూర్తితో పద్యం, గేయం, వ్యాసం, వచన కవిత్వం, సినీకవిత్వం.. ఇలా అన్ని రంగాలనూ ప్రోత్సహించడం మా ధ్యేయంగా వ్యవహరిస్తున్నాం.

2008లో నాగభైరవ మరణానంతరం డా. నాగభైరవ అవార్డు కమిటీ ఏర్పడింది. కేవలం ఆయన శిష్యులు ఒక సంఘంగా ఏర్పడి గత 5 ఏళ్ళుగా (ఇప్పుడు 6వ సంవత్సరం) ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆయనకు అత్యంత ప్రియతమ శిష్యులు, ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి నేతృత్వంలో, మరో ప్రముఖ కవి చిన్ని నారాయణరావు సారధ్యంలో, కళాంజలి అనంత్ కన్వీనర్‌గా, డా. బీరం సుందరరావు మార్గదర్శిగా, ప్రతిఏటా ఘనంగా, కన్నులపండువగా డా. నాగభైరవ అవార్డును అందజేస్తున్నాం. ఆయన సాహిత్య పరీమళం దశదిశలా వ్యాప్తి చెంది ఉండడం, శిష్యులు దేశమంతా, విదేశాల్లో సైతం వుండడంతో ఆ అవార్డు ప్రతిష్ఠాత్మకమైంది. నెల్లూరుకు విశేష కీర్తిప్రతిష్టల్ని ఆర్జించి పెట్టింది.

2009లో తొలిసారిగా ఆ. నాగభైరవ అవార్డు సహజకవి మల్లెమాల (ఎంఎస్ రెడ్డి)కి లభించింది. 2010లో ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య గెలుచుకున్నారు. 2011లో సినీ కవిత్వాన్ని, సాహిత్యాన్ని సృష్టించిన రసరాజుకు ప్రదానం గావించాం. 2012లో ప్రముఖ సినీనటులు తనికెళ్ళ భరణిని ఈ అవార్డు వరించింది. 2013లో ఈ అవార్డును ప్రముఖ సాహితీవేత్త అద్దేపల్లి రామ్మోహనరావుకి ఇచ్చి గౌరవించాం. 2014న ఈ ఏడాది, ప్రముఖ సినీకవి సుద్దాల అశోక్‌తేజకు ప్రదానం గావించబోతున్నాం. నాగభైరవ ఉత్తమ కవితా అవార్డుకు 'రాతి జల' కవితా సంపుటి ఎన్నికైంది. రచయిత అద్దంకి శ్రీనివాస్ ఈ అవార్డును స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, ప్రజలు అందరూ విచ్చేసి జయప్రదం చేయగలరని మనసారా కోరుకుంటున్నాం.

- చిన్ని నారాయణరావు
డా.నాగభైరవ అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి

### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ప్రభుత్వ అనుమతులు, ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం కాగలవు. వ్యవహారాలు, అగ్రిమెంట్లు విషయాల్లో జాగ్రత్త అవసరం. ఆర్థిక ఇబ్బందులుండినా ఏదో ఒక రూపంలో సర్దుబాటు కాగలవు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు వాహన గృహరిపేర్లుంటాయి. ఎవరితోనూ సంబంధాలు దెబ్బ తినకుండా నడుచుకోనండి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్యమైన పనులు వాయిదా పడి టెన్షన్ కలిగిస్తాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. కుటుంబంలో సర్దుబాటుతనం తగ్గుతుంది. పన్నులు, చెల్లింపులు జరుపుతారు. ఆర్థికంగా అభివృద్ధి ఉంటుంది. ఆదాయం స్వల్పంగా పెరిగినను, అదనపు ఖర్చుల భారం తప్పదు. రావలసిన బాకీలు కొంతమేర అందుతాయి. దూరప్రయాణాలుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పెద్దల పరిచయాలకై వేచి వుండవలసి వస్తుంది. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. వర్గాలతో సమస్యలు రావచ్చును. చేపట్టిన పనిని ఏదో ఒక విధంగా పూర్తి చేస్తారు. వ్యాపారవర్గాల వారు ఆటంకాలను అధిగమించి, కొత్త ప్రణాళికలతో అభివృద్ధి వైపు ప్రయత్నిస్తారు. ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంత వరకు లభిస్తాయి.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ప్రభుత్వపరమైన పనులు, అనుమతులు మంజూరు కాగలవు. ఉద్యోగ బాధ్యతలలో మార్పులుంటాయి. చేపట్టిన పనులను పట్టుదలతో సాధించుకొంటారు. వ్యవహారాలలో తొందరపాటు పనులు మాటలు లేకుండా జాగ్రత్తపడండి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గుతాయి. శుభవార్తలు వింటారు. ప్రముఖులను కలుసుకొనడం జరుగుతుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 21.11.2014 నుండి
తేది. 27.11.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, తులలో బుధుడు, 24తేది నుండి వృశ్చికంలో బుధుడు, వృశ్చికంలో రవి శుక్ర శనులు, ధనుస్సులో కుజుడు, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | చతుర్దశి | సా॥గం.5.30వ॥ |
| తేది. 22 | శని | అమావాస్య | సా॥గం.5.46వ॥ |

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | ఆది | పాడ్యమి | సా॥గం.5.10వ॥ |
| తేది. 24 | సోమ | విదియ | సా॥గం.4.10వ॥ |
| తేది. 25 | మంగళ | తదియ | ప॥గం.2.42వ॥ |
| తేది. 26 | బుధ | చతుర్థి | ప॥గం.12.58వ॥ |
| తేది. 27 | గురు | పంచమి | ఉ॥గం.10.57వ॥ |

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయం తృప్తికరంగా ఉండినా కొన్ని ముఖ్య అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. కార్య వ్యవహారాలను ఇతరుల మీద పెట్టకుండా మీరే పర్యవేక్షించడం మంచిది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారవర్గాలకు కొత్త అవకాశాలు, కొత్త పెట్టుబడులు లభించగలవు. ఇతరుల పని మీద ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

### మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యసభలలో పాల్గొనడం, శుభకార్యాలు నిర్ణయం చేయడం జరుగుతుంది. మీ ఆర్థిక ప్రణాళిక, పథకాలు మేలు చేకూర్చగలవు. వృత్తివ్యాపారాలలో ఆదాయం సామాన్యం. పెట్టుబడులకు ఋణాలు చేస్తారు. అనుకున్న పనులు సొంతవి నిదానంగా సాగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదావేసి కొనడం మంచిది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

రావలసిన బాకీలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉన్నది. ఇతరులకు సహాయము చేయుటకు నిర్ణయం తీసికొంటారు. ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాలలో శ్రద్ధ చూపుతారు. ఖర్చులు ఆదాయం సంతృప్తికరంగా సాగుతాయి. అనుకున్న పనులను శ్రద్ధతో పూర్తి చేస్తారు. షేర్లు, స్థిరాస్తులపై లాభాలుంటాయి. సంతోషకరమైన వార్తలు వింటారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఇంటికి వసతులు ఏర్పరచుకోవడం, విలువైన వస్తువులు కొనడం, స్థిరాస్తుల క్రయ విక్రయ ఆలోచనలుంటాయి. ముఖ్యవ్యవహారాలలో సరైన నిర్ణయాలు జరుగుతాయి. ఏ విషయాన్ని తీవ్రంగా పరిగణించక మీ పద్ధతిలో ముందుకు సాగండి. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. ఇంటి రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి. వ్యాపారాలలో మంచి అవకాశాలు చేజారిపోవచ్చును. ఆర్థికాభివృద్ధి పథకాలు, కొత్త ఆర్థిక ప్రణాళికలు కార్యరూపం దాలుస్తాయి. ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరిగి దాచుకున్న డబ్బును గాని, ఋణాలు చేసి గాని ఉపయోగిస్తారు. కుటుంబంలో అనుకూలత తక్కువ. విద్యార్థులకు వ్యాపకాలు పెరిగి చదువుపై శ్రద్ధ తగ్గుతుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఋణాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత ఉంది. ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలను జాగ్రత్తగా నడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. అనుకోని కొన్ని అదనపు ఖర్చులు పైనబడతాయి. పిల్లలు విద్య, వివాహ విషయాలపై దృష్టి పెడతారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. వస్తు వాహన సామాగ్రి రిపేర్లుంటాయి. ఉద్యోగులకు పనిభారం ఎక్కువ. పిల్లల విద్యా వివాహ విషయాలలో శ్రద్ధ చూపుతారు. చేపట్టిన పనులలో ఆటంకాలు, ఆలస్యం ఎదురైనా పట్టుదలతో సాధించుతారు. వృత్తి, ఉపాధి వ్యాపార రంగాల వారికి అభివృద్ధి బాగుండి రాబడి పెరుగుతుంది. అధికారవర్గ సహకారం బాగుంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

తరువాత ఏదో విధంగా సర్దుబాటు అవుతుంది. వృత్తి వ్యాపారాలలో స్తబ్ధత నెలకొంటుంది. యజమానులకు వర్గాలతో సమస్యలుంటాయి. అనవసర విషయాలపై ఆలోచన పెరిగి టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసికొనవలసి ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా అవసరాలకు డబ్బు చేతిలో ఉండదు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

# కళాకారులను ఆదుకోవాలి

**- బిజెపి నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి**

కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని బిజెపి నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. ఈ నెల 15న టౌన్‌హాలులో జరిగిన జైశ్రీ నాట్యమండలి వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, కళాకారులను ఆదుకునేందుకు తగు చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 25 కళాసంఘాల గౌరవాధ్యక్షుడు జివి కృష్ణారెడ్డి, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, కోసూరు రత్నం, బండి శ్రీనివాసులురెడ్డి, గంగాధర్‌రెడ్డి, గాలి కిరణ్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా, కళాకారులు ఎ.ప్రకాశరావు, డివి సురేంద్రరెడ్డి, హరినాయుడులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన భక్తచింతామణి, సత్యహరిశ్చంద్ర నాటక సీన్లు అందరినీ అలరించాయి.




# వేదవ్యాసలో బాలల దినోత్సవం

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూలు విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ 125వ జయంతిని పురస్కరించుకొని భక్తవత్సల నగర్‌లోని అనాథశరణాలయంలో అనాథ పిల్లలతోటి కలిసి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అనాథాశ్రమంలోని పిల్లలు, వృద్ధులకు అందరికీ నిత్యావసర వస్తువులైన సబ్బులు, పేస్ట్‌లు, బ్రష్‌లు, బట్టల సబ్బులు, కొబ్బరినూనె, షాంపులు, దువ్వెనలు మొదలైన వస్తువులను 6నెలలకు సరిపోయే విధంగా ప్రతి ఒక్కరికి స్కూలు విద్యార్థులు ఇవ్వడం జరిగింది. అనంతరం అనాథపిల్లలచే కేక్ కట్ చేయించి అందరికీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థులతో పాటు స్కూలు కరస్పాండెంట్ బాలాజీ, డైరెక్టర్ వేదగిరి, ఉపాధ్యాయులు, ఆశ్రమ నిర్వాహకులు, కమిటీమెంబర్ బివియస్ బాబు పాల్గొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించండి

**- ఐ.జి సునీల్‌కుమార్**

ఎర్రచందనం వృక్షాలను నరికివేసి, అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలించుకుపోతున్న దొంగల భరతం పట్టాలని, ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించాలని గుంటూరు రేంజ్ ఐజి సునీల్ కుమార్ నెల్లూరు, ప్రకాశం జిల్లాల పోలీసు అధికారులను ఆదేశించారు.

ఈ నెల 15న ఆయన నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో ఈ రెండు జిల్లాల పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పలు కేసుల వివరాలను ఆయన సమీక్షించారు. అసలు ఎర్రచందనం చెట్లను నరికేవారిని, వాటిని తీసుకువెళ్తున్న వాహనాలవారినే కాకుండా, అసలు ఈ స్మగ్లింగ్‌కు మూలకారకులైన వారి మూలాలు తెలుసుకుని, వారిని అరెస్ట్ చేయడం ద్వారా ఎర్రచందనం స్మగ్లింగ్‌ను శాశ్వతంగా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. పేదల ఆశలను, బలహీనతలను అడ్డు పెట్టుకుని, వారిని మోసం చేసే చిట్‌ఫండ్ కంపెనీలపై ఏవైనా ఫిర్యాదులొస్తే వెంటనే వాటిపై స్పందించాలని ఆయన ఈ సందర్భంగా పోలీసులకు సూచించారు. కిందిస్థాయి ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేసేవిధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. వారి విధులపై స్పష్టత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే అర్జీదారులతో ఎలా మెలగాలో, సమస్యలు వినడంలోనూ, వాటిని పరిష్కరించడంలోనూ ఎంత సామరస్యంగా వుండాలో వారికి తెలియజెప్పాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలన్నారు.



ఈ సందర్భంగా, ఆయన గతంలో ఎన్నికల సమయంలో నమోదైన కేసుల దర్యాప్తు విషయాన్ని కూడా విచారించారు. త్వరితగతిన ఆ దర్యాప్తు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సెంథిల్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌లతో పాటు, రెండు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు అధికారి వారి కార్యాలయము, సర్వశిక్షాఅభియాన్

**శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా**

## టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.689/ఏ3/ఎ.యం.ఓ/రా.వి.మి./2012 తేది. 17-11-2014

సర్వశిక్షాఅభియాన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారి ఆధ్వర్యములో జిల్లా యందలి 231 స్కూలు కాంప్లెక్స్/MRCల యందు ROT's(Received only Terminals)కి సంబంధించిన యాన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ కొరకు అర్హులైన సంస్థల నుండి కొటేషన్స్ కోరబడుచున్నవి.

టెండరు దరఖాస్తు కొరకు శ్రీయుత జిల్లా కలెక్టరు మరియు ఛైర్మన్, సర్వశిక్షాఅభియాన్, నెల్లూరు వారి పేరున రూ.500/-లకు ఏదైనా జాతీయ బ్యాంకు నుండి డి.డి. తీసి టెండరు అప్లికేషన్‌ను ప్రాజెక్టు అధికారి, రాజీవ్ విద్యామిషన్ కార్యాలయము, దర్గామిట్ట, నెల్లూరు నందు తేది.19.11.2014 నుండి 26.11.2014 12.00 గంటల వరకు కార్యాలయ పని దినముల యందు పొందవచ్చును. పూరించబడిన టెండరు షెడ్యూల్ తేది.26-11-2014 సాయంత్రము 3.00లోపు రాజీవ్ విద్యామిషన్, ప్రాజెక్టు కార్యాలయము నెల్లూరు నందు అందజేయవలయును.

సదరు షెడ్యూల్‌ను ఓపెన్ చేసి ఫైనలైజ్ చేయుటకు శ్రీయుత అదనపు సంయుక్త కలెక్టరు, కలెక్టరు గారి కార్యాలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు నందు తేది.26-11-2014 సాయంత్రము 4.00గంటలకు నిర్ణయించడమైనది.

ప్రాజెక్టు అధికారి,
సర్వశిక్షాఅభియాన్
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా



# సహస్ర దీపోత్సవం

ఈ నెల 16వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మకాలనీలో గల అష్టలక్ష్మి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సహస్రదీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దాదాపు 1600మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించి, పూజలు నిర్వహించారు. ఆదిత్యనగర్‌కు చెందిన వ్యాపారవేత్త ఏల్చూరు శ్రీనివాసులు దంపతులు మరియు ప్రభ మెడికల్స్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఎంపీ నిధులు 10 లక్షలు మంజూరు

నెల్లూరు కొండాయపాళెం బీటీ రోడ్డు నుంచి ఇస్కాన్ సిటీ వెంకన్న కాలువ వరకు డ్రైనేజీ కాలువలు నిర్మించేందుకు నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి రూ.10 లక్షలు విడుదల చేశారు. దీనికి సంబంధించిన పత్రాలను మంగళవారం నెల్లూరు ఇస్కాన్ సిటీ వాసులకు ఎంపీ కార్యాలయంలో అందజేశారు.

## సీనియర్ జర్నలిస్ట్ ఎ.బి.వి.నరసింహారావు సంస్మరణ సభ

పాత్రికేయ రంగానికి దివంగత ఎబివి నరసింహారావు అందించిన సేవలు అభినందనీయమని నందనవనం శ్రీహరిరావు అన్నారు. ఆదివారం సద్భావన-సాధన సంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని ప్రభుత్వ పింఛనుదారుల భవనంలో సంస్మరణ సభ జరిగింది. సభాధ్యక్షులుగా శ్రీహరిరావు పాల్గొన్నారు. ఈ సభలో సీనియర్ పాత్రికేయులు కె.రామమోహన్‌రావు మాట్లాడుతూ నరసింహారావు నిబద్ధతగల పాత్రికేయులని, దాదాపు ఐదు దశాబ్దాల పాటు విశేషసేవలు అందించారని తెలిపారు. కథలు, నవలలు, నాటకరచనలు, సంగీత రంగాలలో గుర్తింపు పొందినవారని, ఆకాశవాణిలో వార్తావ్యాఖ్యలతో శ్రోతలను అలరించారని తెలిపారు.

ఈ సభలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మారుతి, కార్యదర్శి విజయచంద్ర, ప్రతాప్‌రెడ్డి, బి.వి.లక్ష్మీనారాయణ, ఆర్.రామచంద్రరావు, సాయిశ్రీధర్, ప్రవీణ్, నాథ, మాజీకౌన్సిలర్ కలికి శ్రీనివాసులురెడ్డి, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### వేగూరు మస్తాన్‌రెడ్డి



కోవూరు మండలం చెర్లోపాలెం వాస్తవ్యులు, ఆ గ్రామంలో పెద్దరైతు వేగూరు మస్తాన్‌రెడ్డి(79) ఈ నెల 12వ తేదీన స్వర్గస్థులయ్యారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కెన్సెస్ గ్రూప్ హోటల్స్ అధినేత, చెన్నైలోని ఆంధ్రాక్లబ్ మాజీఅధ్యక్షులు కె.నరసారెడ్డి ఆయనకు అల్లుడవుతాడు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో మస్తాన్‌రెడ్డి అంటే తెలియనివారుండరు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన రైతుగానే మరణించాడు. ఆయన ఉత్తరక్రియలు ఈ నెల 26వ తేదీన చెర్లోపాలెంలో జరుగనున్నాయి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### తుమ్మల వెంకటరమణరెడ్డి



నెల్లూరు రామ్మూర్తినగర్ వాసి, శేఖర్ వైన్స్ అధినేత తుమ్మల వెంకటరమణరెడ్డి ఈ నెల 19వ తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 81సంవత్సరాలు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విలాస్‌రెడ్డి నెల్లూరులో అందరికీ సుపరిచితుడే కాక కుమార్తె అమెరికాలో వైద్యవృత్తిలో సేవలందిస్తున్నారు. వెంకటరమణారెడ్డి స్వగ్రామం కోవూరు కాగా వ్యాపారరీత్యా నెల్లూరులో స్థిరపడ్డారు. వివాదరహితుడిగా, పదిమందికి మంచి సలహాలు చెప్పే వ్యక్తిగా ఆయనకు మంచి పేరుంది. తండ్రిని కోల్పోయి దుఃఖ సాగరంలో వున్న విలాస్‌రెడ్డికి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతూ రమణారెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తోంది 'లాయర్'.

# 'శుభమస్తు' కార్తీక వెలుగులు



కార్తీకమాసం సందర్భంగా 'శుభమస్తు' షాపింగ్‌మాల్ మరియు ఇస్కాన్ బృందంచే నెల్లూరు శుభమస్తు షాపింగ్‌మాల్ ముందు కార్తీక దీపోత్సవం జరిగింది. ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన కార్తీక మాసం నందు భగవంతునికి దీపసమర్పణ చేసి శ్రీకృష్ణుని కృపకు పాత్రులు కాగలరని మరియు భక్తికి, ముక్తికి హరి నామస్మరణ ఎంతో ప్రాధాన్యం అని సుఖదేవ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోధకృష్ణుడు(దామోదర రూపం) తాత్కాలిక విగ్రహప్రతిష్ట చేసి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు భగవంతునికి దీపం సమర్పించే అవకాశం కల్పించి తీర్థప్రసాదాలను పంచారు.

ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా రమణయ్య, బయ్యా వాసు, బయ్యా రవి పాల్గొన్నారు.

# తిరుమల వెంకయ్య సేవకు నెల్లూరు భక్తబృందం

తిరుమలలో కొలువైన కలియుగ దైవం వెంకటేశ్వరునికి సింహపురికి చెందిన భక్తబృందం సేవ లందించనున్నట్లు టిటిడి హిందూ ధర్మప్రచార మండలి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం తెలిపారు. వారం రోజులపాటు తిరుమలలో శ్రీవారి సేవ కోసం బయల్దేరిన భక్తబృందానికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీ, హిందూ ధర్మ ప్రచార మండలి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మనగుడి ఆరవ విడత కార్యక్రమంలో సేవలందించిన 30మంది స్వామివారి సేవకు బయల్దేరారని చెప్పారు. ఈనెల 22 వరకు సేవలందిస్తారని తెలిపారు. ఈనెల 22వతేదీన మరో విడతగా శ్రీవారి సేవకులను నెల్లూరులోని టీటీడీ కల్యాణమండపంలో ఎంపిక చేయనున్నామన్నారు. స్వామివారి సేవకై ఆసక్తి ఉన్నవారు టీటీడీ కార్యాలయంలోని హిందూ ధర్మ ప్రచారమండలి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వంజివాక ధనుంజయ, ఉపాధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పండుగొచ్చింది

(మొదటిపేజీ తరువాయి)

ఏ దూరదేశంలోనో.. ఎక్కడో క్రికెట్ ఆడుతూ, బ్యాట్ చేతపట్టి అవిశ్రాంత పరుగుల వీరునిలా టీవీల్లో కనిపించే సచిన్, ఇప్పుడు సాక్షాత్తూ ఈ జిల్లాలోని ఓ కుగ్రామానికి విచ్చేసి, అక్కడి ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడడం.. ఈ జిల్లాకే ఒక అపూర్వ, అపురూప ఘట్టం. ఎంపీగా ఆయన, జిల్లాలోని మారుమూల కుగ్రామమైన పుట్టంరాజు కండ్రిగను దత్తత తీసుకోవడం.. దాని అభివృద్ధికి బాటలు వేయాలని నిర్ణయించుకోవడం నిజంగా జిల్లాకు ఒక గొప్ప వరం. దీంతో, సచిన్ చలువతో ఇక ఈ గ్రామానికి మహర్దశ వచ్చేసినట్లే. ప్రధాని సంసద్ ఆదర్శగ్రామ్ యోజన పథకం కింద పుట్టంరాజు కండ్రిగను సచిన్ దత్తత తీసుకోవడం, ప్రగతి ఎరుగని ఆ కుగ్రామంలో అభివృద్ధి పనులకు అంకురార్పణ జరగడం ఆ గ్రామ ప్రజల అదృష్టం. ఆ ప్రగతి పనులను పరిశీలించేందుకు ఆయన ఈ నెల 16వ తేదీన పుట్టంరాజు కండ్రిగకు విచ్చేశారు. సచిన్ రాకతో ఆ గ్రామం పులకించి పోయింది. జిల్లా ప్రజలంతా సంతోషంతో ఉప్పొంగిపోయారు. అనేకమంది ప్రముఖులు, అధికారులూ, ప్రజలూ సచిన్‌కు ఘనస్వాగతం పలికారు.

తాను దత్తత తీసుకున్న గూడూరు మండలంలోని మారుమూల గ్రామమైన పుట్టంరాజు కండ్రిగలో పలు అభివృద్ధి పనులకు సచిన్ ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ. 2.79 కోట్ల రూపాయలతో గ్రామాన్ని అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణం, చెరువు అభివృద్ధి, శ్మశానవాటిక ప్రహరీకి, రోడ్డుకు వగైరాలకు అవసరమైన నిధులను కేటాయించడమే కాక, ప్రత్యేకించి ఆటస్థలం కోసం దాదాపు రూ.74లక్షలు వెచ్చించనున్నారు. ఒక ఎకరా స్థలంలో క్రికెట్‌తో పాటు, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులను కూడా ఏర్పాటు చేయనుండడం విశేషం. ఈ సందర్భంగా సచిన్ తొలుత ఎంతో భక్తిశ్రద్ధలతో గోపూజ చేయడం, గర్భిణీస్త్రీలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని, స్త్రీలకు పసుపు కుంకుమ, చీరలను అందజేయడం, చిన్నారులు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని వారి ఆటపాటలను శ్రద్ధగా ఆలకించడం, చిన్నారులతో, గ్రామంలోని వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడడం మరింత విశేషం. ఈ సందర్భంగా, గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సచిన్ మాట్లాడుతూ,ప్రభుత్వం తనకు ప్రదానం చేసిన 'భారతరత్న' బిరుదును త్యాగానికి మారుపేరైన మహిళలందరికీ అంకితం చేస్తున్నట్లు ప్రజలందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సచిన్ మాటలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ తెలుగులోకి అనువదించి, గ్రామస్తులకు అర్థమయ్యేలా వివరించారు. చెల్లిగా, ఇల్లాలిగా, తల్లిగా నిత్యం అనేక పాత్రల్లో మహిళలు ఎంతో ఓర్పుతో ఇంటిని చక్కదిద్దుతారని, వారి సహనం, త్యాగం మరువలేనివని సచిన్ అన్నారు. పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పి, దేశం గర్వించేలా వారిని తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, స్వచ్ఛభారత్‌లో భాగంగా అందరూ పారిశుద్ధ్యాన్ని పాటించాలని సచిన్ కోరారు. పుట్టంరాజుకండ్రిగను దేశంలోనే ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఈ కార్యక్రమాల్లో సచిన్‌తోపాటు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జిల్లాకలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ జి. రేఖారాణి, ఎజెసి రాజ్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డ్వామా పి.డి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సచిన్‌కు చిరుకానుకగా వెంకటగిరి చీరను బహూకరించారు. పుట్టంరాజు కండ్రిగను దత్తత తీసుకుని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చినందుకు, ఆ కుగ్రామాన్ని దాదాపు మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నందుకు ఆయన ఈ సందర్భంగా సచిన్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బలహీన ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంపై దృష్టి పెట్టడంతో పాటు రాష్ట్రంకు ఆభరణంలా వున్న సాగర తీరాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలనేదానిపై ఆలోచించాలి. ఇవన్నీ ప్రభుత్వం చేయడం లేదు... సరికదా, అవినీతి పేట్రేగిపోతోంది. అధికారుల బదిలీలను పూర్తిగా పార్టీ కార్యక్రమంగా మార్చేసారు. బదిలీలకు కొందరు నేతలు డబ్బు దండుకుంటున్నారు. ఋణమాఫీ కోసం రైతులు, డ్వాక్రా మహిళలు ఓ పక్క రోడ్డెక్కుతున్నారు. ఇంకోపక్క ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంటుంది. మరోపక్క కృష్ణా, గుంటూరు రైతులు ప్రభుత్వంపై తిరగబడుతున్నారు.

ఈ పరిస్థితులు రాష్ట్రంలో ప్రతిపక్షానికి ఒక పదునైన ఆయుధం లాంటివి. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షం విరుచుకుపడొచ్చు. గుంటూరుజిల్లా రైతుల్లో వస్తున్న ఆందోళనను ఆసరగా చేసుకుని ప్రధాన ప్రతిపక్షం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పెద్ద ఉద్యమాన్నే నడపవచ్చు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేయవచ్చు. రాష్ట్రంలో వైకాపా బలహీనంగా ఏమీ లేదు. 66మంది సభ్యులతో చాలా బలంగా వుంది. కాని ఎందుకనో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రభావవంతంగా దాడి చేయలేకపోతుంది. 1994లో కాంగ్రెస్‌కు వచ్చింది 27సీట్లే. అప్పుడింకా అసెంబ్లీలో 294సీట్లుండేవి. అయినా ఆరోజు కాంగ్రెస్ అధికార తెలుగుదేశం ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టింది. ఈరోజు 175మంది ఎమ్మెల్యేలున్న రాష్ట్రంలో 66మంది ఎమ్మెల్యేలను పెట్టుకుని కూడా వైకాపా సమర్థవంతంగా వ్యవహరించలేకపోతోంది. ఇప్పుడు కనుక వైకాపా రైతులకు అనుకూలంగా ఉద్యమం నడిపితే అది అగ్గిలా రాజుకోవడం ఖాయం. కాని వైకాపా ఆ ప్రయత్నాలు చేయడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలను అవకాశంగా మలచుకుని ఎదురుదాడికి దిగడానికి ఏ మాత్రం సాహసించడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ దొందూ దొందే అన్నట్లుగా మారడం శోచనీయం.

గల్పిక

# భేతాళకథ సింగపూర్ చంద్రుడు

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీ మార్నింగ్ ఎయిట్‌థర్టీకల్లా నిద్రలేచాడు. కార్తీకమాసం సందర్భంగా మద్యం, మాంసం బంద్ చేయడంతో పరగడుపునే ఆకలి కాసాగింది. పులులు, సింహాలు బాత్రూంకు పోయాకే, పళ్లు తోమాకే తినడం లేదుగా... కాని అవి మనకంటే బలంగా ఉంటున్నాయి కదా... వాటికి లేని ఫార్మాలిటీస్ మనకు మాత్రం ఎందుకనుకుని బ్రెష్ చేయకుండానే మురళీకృష్ణ హోటల్‌కెళ్లాడు. నాలుగు ఇడ్లీలు ఆర్డర్ ఇచ్చి నాలుగు బకెట్ల సాంబార్ లాగించాడు. ఇతనికి సాంబార్ సప్లయ్ చేసిన సర్వర్ శోష వచ్చి పడిపోయాడు. బ్రేక్‌ఫాస్ట్ ముగించాక విక్రమార్కుడు ఆరోజుకి డ్యూటీ పూర్తి చేద్దామని పెద్దాసుపత్రికి వెళ్లేందుకు ఏ.సి కూరగాయల మార్కెట్ వద్ద నిలబడ్డాడు. ఇతను అలా నిలబడ్డాడో లేదో అతని ముందు పది ఆటోలు ఆగాయి. మా ఆటో ఎక్కంటే మా ఆటో ఎక్కంటూ ఆటోవాలాలు అడుగుతుండగా క్షణకాలంలో ఒక ఆటోవాలా విక్రమార్కుడి చేయి గుంజి తన ఆటోలో వేసుకుని బయలుదేరాడు. విక్రమార్కుడు ఆ షాక్ నుండి తేరుకునేలోపే ఆటో పెద్దాసుపత్రి ముందు ఆగింది. విక్రమార్కుడు దిగి పెద్దాసుపత్రిలోకి వెళ్లాడు. మార్చురీలోకి వెళ్లి ఓ మంచి శవాన్ని సెలక్ట్ చేసుకుని భుజాన వేసుకొని బోడిగాడితోటలోని రోటరీక్లబ్ శ్మశాన వాటిక వైపు బయలుదేరాడు. విక్రమార్కుడు రెండడుగులు వేసాడో లేదో శవంలోని భేతాళుడు... ఏం విక్రమార్కా, ఎలా ఉన్నావని అడిగాడు. విక్రమార్కుడికి ఆశ్చర్యమేసి... ఏంటి భేతాళా ఇవాళ ఇంత యాక్టివ్‌గా ఉన్నావు, ఎప్పుడు చూసినా నడవడం మొదలుపెట్టాక అరగంటకిగాని లేచేవాడివి కాదు... ఇవాళేంటి ఇలా అని ప్రశ్నిం చాడు. అందుకు భేతాళుడు... ఇంతకుముందంటే రాత్రికి ఒక క్వార్టర్ వేసి పడుకునే వాడిని, కాబట్టి తొందరగా మెలకువ వచ్చేది కాదు. కాని ఇప్పుడు కార్తీక మాసం కదా, అన్నీ మానేసాను, సరిగ్గా నిద్రపట్టి చావడం లేదన్నాడు. ఇంకేంటి విశేషాలని విక్ర మార్కుడు అడిగాడు. ఏముంది విక్రమార్క... కరెంట్ ఆఫీసు సెంటర్ వైపు పోయేవు... అక్కడ వెంకయ్య నాయుడు వున్నాడు. పటేల్ బొమ్మ ఆవిష్కరణ పెట్టాడు. 'స్వచ్ఛభారత్' అంటూ వచ్చిన వాళ్లందరి చేత చీపుర్లు పట్టి చిమ్మిస్తున్నాడు అని భేతాళుడు చెప్పాడు. మన జాయింట్ కలెక్టర్ రేఖారాణి భలే పని చేసింది. ఈ జిల్లాలో పిఆర్ కండ్రిగ అనే గ్రామాన్ని సచిన్ దత్తత తీసుకునేలా చేసిందని విక్రమార్కుడు అన్నాడు. దానికి భేతాళుడు... నీకు అంతవరకే తెలుసు... మన ప్రధాని నరేంద్ర మోడీ ఈ దత్తతకు ఈమధ్యే శ్రీకారం చుట్టాడు. ఆయన వారణాసిని జపాన్ వాళ్లకు, విశాఖపట్నం, అహ్మదాబాద్‌లను అమెరికాకు దత్తత ఇచ్చాడు. తాజాగా హైదరాబాద్ నగరాన్ని ఆస్ట్రేలియాకు దత్తత ఇవ్వాలనుకుంటున్నాడని చెప్పాడు. మరి మన చంద్రబాబు ఈ విషయంలో ఏమీ చేయడం లేదా? అని విక్రమార్కుడు అడిగాడు. అప్పుడు భేతాళుడు... ఆ... అక్కడికే వస్తున్నా, కరెక్ట్‌గా గుర్తు చేసావు. నీకు డైలీ ఏదో ఒక కహానీ చెప్పాలి కాబట్టి, 'సింగపూర్ చంద్రుడు' కథ చెబుతాను విను అంటూ మొదలుపెట్టాడు.

సోనియాగాంధీ కసికొద్దీ తన కొడుకు రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న దుర్బుద్ధి కొద్ది నిండుకుండలా వున్న ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టింది. తెలంగాణ విడిపోగా, అప్పుల కుప్పగా మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన సీఎం అయ్యింది మొదలు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి రాజధాని నిర్మాణమే తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నాడు. ఒకరోజు సింగపూర్, మరోరోజు కౌలాలంపూర్, పక్కరోజు బ్యాంకాంక్, ఇంకోరోజు హాంకాంగ్, బీజింగ్, వాషింగ్టన్, న్యూయార్క్, చికాగో, టోక్యో, సిడ్నీ, మెల్‌బోర్న్, ఇస్తాంబుల్... ఇలా రాజధాని కోసం ఆయన పరిశీలించని పేర్లు లేవు. ఓ పక్క ఆయన రాజదానికి ఎంపిక చేసిన మండలాల్లోని రైతులు మాత్రం మా భూములు పాడుచేయొద్దు బాబో అని మొత్తుకుంటున్నారు. నేలను నమ్ముకుని బ్రతికే వాళ్లం... ఆ నేలను కోల్పోతే బ్రతకలేమని వేడుకుంటున్నారు. కాని చంద్రబాబు మాత్రం ఒప్పుకోవడం లేదు. ఎన్నాళ్లని మీరు ఈ మట్టిని పిసుక్కుంటారు. మీకు ఈ భూములుండబట్టే కదా మట్టిని పిసుక్కునే గతి పట్టింది. మీకు ఆ భూములు లేకుండా చేస్తే ఆ దుస్థితి తప్పుతుంది... రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు బంగారు పళ్లేలు ఇస్తాం... శుభ్రంగా వాళ్లు వాటితో అడుక్కు తినవచ్చు అని చెప్పి చంద్రబాబు వారి నుండి భూములు తీసుకునే ప్రోగ్రాంను ఓ పక్క పెట్టారు. ఇంకో పక్క రాజధానిపై అధ్యయనానికంటూ సింగపూర్‌కు వెళ్లారు. అక్కడ పడవలో తిరిగారు. సింగపూర్ దేశస్థులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. సింగపూర్ వంటి రాజధానినే ఏపిలో కడతానని సొరకాయలు కోస్తున్నాడు. సింగపూర్ నుండి రాగానే మళ్లీ జపాన్‌కు పోతున్నాడు. అక్కడ నుండి వచ్చాక ఏపికి టోక్యోలాంటి రాజధానిని కడతానంటాడేమో... రాష్ట్రంలో ఓ పక్క ఋణమాఫీ అమలు కావడం లేదు... పింఛన్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారుల బదిలీలపై మంత్రులే తన్నుకుంటున్నారు. అధికారపార్టీ నాయకులే కలెక్షన్ సెంటర్‌లు తెరిచారనే ప్రచారం జరుగుతుంది. అన్నింటికిమించి పాత అప్పులు మాఫీ కాక కొత్త అప్పులు పుట్టక రైతులు సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రజలు ఇన్ని సమస్యలతో ఇబ్బంది పడుతుండగా చంద్రబాబు ఇవన్నీ వదిలేసి సింగపూర్ లాంటి రాజధానిని కట్టాలంటూ విదేశాలకు ఎందుకు పోతున్నట్లు? ఇప్పుడు అందమైన రాజధాని అంత అవసరమా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా వుండి కూడా ఏ పవర్ లేని యనమల రామకృష్ణుడు మాదిరిగా మానసిక వేదనకు గురవుతావని హెచ్చరించాడు.

అప్పుడు విక్రమార్కుడు... భేతాళ, అసలాయనే వుంటే ఇంకొకాయనతో పనేముందన్నట్లుగా వుంది నువ్వు చెప్పేది. రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించే మార్గమే ఉంటే చంద్రబాబు అదే పని చేసేవాడు. ఆ దారి లేక సింగపూర్ లాంటి రాజధాని అంటూ తప్పించుకునే దారిలో పోతున్నాడు. సమస్యలనుండి తప్పించుకునే దానికే ఈ రాజధాని ప్లాన్. రాజధాని ఆ నగరంలా ఉండాలి, ఈ నగరంలా ఉండాలంటూ చంద్రబాబు అన్ని దేశాలు తిరుగుతాడు. అప్పటికే మూడు, నాలుగేళ్లు గడిచిపోతాయి. ఆ తర్వాత ఎన్నికలసీజన్ మొదలవుతుంది కాబట్టి చంద్రబాబే కాదు, జనం కూడా రాజధాని గురించి మరచిపోతారు. సింగపూర్ లాంటి రాజధాని అనేది చంద్రబాబు రాజకీయ రక్షణకే కాని అది కట్టడానికి కాదని విక్రమార్కుడు చెప్పాడు. ఆ సమాధానంతో సంతృప్తి చెందిన భేతాళుడు బాడీని విక్రమార్కుడి భుజం మీదే వదిలేసి పక్కనేవున్న టూరిజం హోటల్‌లోకి దూరాడు.

★★★★★

కదంబం

# నిశ్శబ్దం

- పాతూరి అన్నపూర్ణ,
నెల్లూరు. 94902 30939.

నిశ్శబ్దం
ఒక్కోసారి వరంలా లభిస్తుంది
మనసు నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు
కళ్ళముందు సాక్షాత్కరించే పదచిత్రాలు
అక్షరాలుగా ఆకృతిని
సంతరించుకుంటాయి
వర్ణరాగాలై కాగితాలను
కౌగలించుకుంటాయి
మనోమంత్రాక్షరాలను మననం
చేయాలన్నా
చుట్టూ నిశ్శబ్దావరణాన్ని చుట్టుకోవలసిందే
మేధోమధనంతో ఉదయించే వెలుగురేఖలు
నిశ్శబ్ద గవాక్షం నుండే ఆవిర్భవిస్తాయి!
చాపక్రింద నీరులా ప్రవహించే నిశ్శబ్దం
ఒక్కసారిగా ప్రభంజనమై
భావ విప్లవానికి బాటలు వేస్తుంది
అంతెందుకు?
ఈ రణగొణధ్వనుల
ప్రపంచానికి దూరంగా
కొన్ని నిమిషాలైనా నిశ్శబ్దమందిరంలో
విశ్రాంతి తీసుకోవాలని
అందరమూ కోరుకుంటాం
మౌన తపస్సుతో సేదతీరిన మనసు
కొత్త చిగుళ్ళు వేసిన వృక్షంలా
మరిన్ని ఆకుపచ్చని ఆవిష్కరణలకు
శ్రీకారం చుడుతుంది.

# కార్తీక మాస చివరి సోమవార పూజలు



కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో నెల్లూరు నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. అభిషేకాలు నిర్వహించడంతో పాటు కార్తీక దీపాలు వెలిగించి పరమేశ్వరుడికి విశేషపూజలు చేశారు. సాయంత్రం ఆకాశదీపాలు వెలిగించారు. ఉసిరి, జమ్మి వృక్షాల క్రింద పూజలు నిర్వహించిన అనంతరం ఉపవాసదీక్షలు విరమించారు. విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయాలు శోభిల్లాయి. మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. వహాబ్‌పేట, నవాబుపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట, సంతపేట, కొండాయపాలెంగేటు తదితర ప్రాంతాల్లో శివాలయాల్లో అర్చకులు విశేష పూజలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## కమనీయం భువనేశ్వరి మూలస్థానేశ్వరస్వామి కల్యాణం

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో 16వ తేదీ రాత్రి భువనేశ్వరి, మూలస్థానేశ్వర కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. దేవస్థానంలో శివపంచాక్షరీ భజనలు జరిగాయి. నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో సహస్ర కార్తీక దీపాలంకరణ సేవ కనులపండువగా జరిగింది. అమ్మవారు బంగారు చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపోత్సవాన్ని తిలకించి అమ్మవారిని దర్శించుకున్నారు.

# దేవాలయాల అభివృద్ధికి పటిష్టమైన చర్యలు

**— దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ**

దేవాలయాల అభివృద్ధికి నిధుల కొరత లేదని, నిధులు పుష్కలంగా వున్నాయని, ఆలయాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ వెల్లడించారు. ఈనెల 15న ఆమె నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా, విలేకరులతో మాట్లాడారు. దేవాదాయశాఖలోని ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.250 కోట్లతో ప్రత్యేక నిధిని కూడా ఏర్పాటుచేయనున్నామని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. తమ శాఖకు సంబంధించి, జిల్లాలో విలువైన ఆస్తుల లీజు కాలం పూర్తయిన వెంటనే, కొత్తగా లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రాణదానం, విద్యాదానం పథకాల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అర్చకుల సమాఖ్యవారు అర్చకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ రవీంద్రరెడ్డి, అధికారులు శివకుమార్, కోదండరామిరెడ్డి, వెంకటరమణ, శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్‌ను కలసి తమ సమస్యలు విన్నవించినవారిలో అర్చక సమాఖ్య ప్రతినిధులు ఉదయగిరి వెంకటశేషాచార్యులు, వర్ఝల శ్రీనివాసశర్మ, గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, ఏ. విజయరాఘవాచార్యులు తదితరులున్నారు.

# వైభవంగా ధ్వజారోహణం

నెల్లూరు వేదాయపాలెం శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో 16వ తేదీ రాత్రి మండల పూజలకు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కేరళ సంప్రదాయ రీతిలో హరినంబూద్రి పూజలను నిర్వహించారు. అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు పి.టి.రంగరాజన్, ఉపాధ్యక్షులు బాలుస్వామి, కార్యదర్శి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అంకురార్పణ పూజల్లో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డైరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల పూజల్లో భాగంగా ఆలయంలో 41రోజుల పాటు ప్రత్యేకపూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయి. డిసెంబర్ 25, 26, 27తేదీలలో కళశాభిషేకం, డిసెంబర్ 28న నగరోత్సవం, 29న ఆరాట్టు ఉత్సవం, జనవరి 1న నెయ్యాభిషేకాలు, జనవరి 14న అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకాలు, సాయంత్రం కర్పూరజ్యోతి దర్శన కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం అయ్యప్పభక్తులకు అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయి.

# 'దేశం'పై అభిమానం ఉప్పొంగుతోంది



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నెల్లూరు జిల్లాలో అనూహ్య స్పందన వస్తోందని, చంద్ర బాబు నాయుడి పాలనపై నమ్మకంతో కొత్తవారు కూడా సభ్యత్వం తీసుకుంటున్నారని, ఇప్పటి వరకు 38,460 మంది కొత్త సభ్యులుగా చేరారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర తెలిపారు. మంగళవారం నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ఈనెల 3 న ప్రారంభించిన సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభించిందన్నారు. క్రియాశీల సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యునికి రూ. 2లక్షలు ప్రమాదబీమా కల్పించామన్నారు. ఈ సమావేశంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాదరావు, నెలవల సుబ్రహ్మణ్యం, కంభం విజయరామిరెడ్డి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, వేనాటి రామచంద్రారెడ్డి, గూటూరు కన్నబాబు, డాక్టర్ జ్యోత్స్నలత, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బెజవాడ ఓబుల్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు.



ఇటీవల నెల్లూరు పొగతోటలోని ప్రముఖ సీనియర్ న్యాయవాది వేములపాటి అనంతరామయ్యను ఆయన స్వగృహంలో కలసి పరామర్శిస్తున్న ప్రజాగాయకుడు గద్దర్

# దేశాన్ని ఏకతాటిపై నిలిపిన నేత పటేల్

## - కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు




భారతదేశపు తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ మహోన్నత నాయకుడని, ఆయనెంతో ఆదర్శప్రాయుడని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్‌లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంశ్యవిగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్ గొప్ప దేశభక్తుడని, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని అన్నారు. సత్యాగ్రహోద్యమంలో గాంధీకి అనుచరునిగా మెలిగారన్నారు. అయితే, ప్రభుత్వాలు ఆ మహానేత సేవలను ఆశించినస్థాయిలో గుర్తించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అప్పట్లో అస్తవ్యస్తంగా వున్న దేశాన్ని సమైక్యపరచి, దేశాభ్యున్నతికి బాటలు వేసిన మహోన్నత నాయకుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని ఆయన కీర్తించారు. స్వామీ వివేకానంద, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్.. ఈ ముగ్గురినీ తానెంతో ఆరాధిస్తానని, ఆ మహనీయుల సేవలు మనకు మార్గదర్శకమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డుకు సర్దార్ వల్లభాయ్ పటేల్‌రోడ్డుగా నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. నెల్లూరుకు విమానాశ్రయం రావడం అంత సులభమేమీ కాదని అంటూ, ప్రజలంతా ఆమోదిస్తే నెల్లూరు పేరును విక్రమ సింహపురిగా నామకరణం చేసేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ మాట్లాడుతూ భారతరత్న, ఉక్కుమనిషి అయిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తాను పాల్గొనడం తనకెంతో ఆనందంగా వుందన్నారు. పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అందరూ కలసి కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోడీ స్వచ్ఛభారత్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు చేపట్టడం ఒక మంచి పరిణామమని, ఆ కార్యక్రమాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయని ప్రశంసించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఆ నేతలు ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్‌కుమార్. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్, బిజెపి నాయకులు ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, వైఎస్సార్సీపి నాయకులు మేరిగ మురళి, కార్పొరేటర్లు జడ్ శివప్రసాద్, నూనె మల్లికార్జునయాదవ్, మేకల రజని, దొడ్డపనేని రాజానాయుడు, మామిడాల మధు తదితరులతో పాటు జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రముఖులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తరక్రియలు

అభిమానం, ఆప్యాయతలకు ప్రతిరూపంగా నిలిచి,
పదిమందికి మంచిని చెప్పి, మమతలు పంచిన మానవతామూర్తి,
మా ఇంటి దైవం

శ్రీ వేగూరు మస్తాన్‌రెడ్డి గారు

తేది. 12-11-2014 బుధవారం పరమపదించారు.
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: వేగూరు సత్యవతమ్మ

కుమారులు - కోడళ్ళు
వేగూరు రాజేంద్రప్రసాద్‌రెడ్డి - మమతా
వేగూరు వెంకటశివకుమార్‌రెడ్డి - నీలిమా

కుమార్తెలు - అల్లుళ్ళు
కొండ్లపూడి లక్ష్మీరెడ్డి - కొండ్లపూడి నరసారెడ్డి
కోటు రాణీసంయుక్త - కోటు మోహన్‌రెడ్డి

ఉత్తరక్రియలు:
తేది. 26-11-2014 బుధవారం నెల్లూరుజిల్లా,
కోవూరు మండలం, చెర్లోపాళెం గ్రామంలోని
మా స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

మనుమలు - మనుమరాళ్ళు
దివ్య - వంశీ, దీపేష్, అభిషేక్ - లక్ష్మీప్రసన్న, అనీష్, అనుదీప్,
సాయి సమ్యక్ష, తేజ - రేష్మ, కార్తీక్ - శ్రావణి
మునిమనవండ్లు: సాయిప్రణీత్, జయహావిష్


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com